# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 2 సంచిక : 19 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : బాపట్ల గురువారం 24 సెప్టెంబర్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :2 ISSUE : 19 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : BAPATLA THU 24 SEPTEMBER 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Bapatla,Ongole,Visakhapatnam,Kakinada,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur




డ్యాన్సర్స్ అసోసియేషన్‌లో

## కొట్లాట..

**పోలీస్ స్టేషన్‌కు చేరిన సుమలత వర్సెస్ రఘు మాస్టర్ పంచాయితీ!**

పెన్ పవర్ డెస్క్:టాలీవుడ్ డ్యాన్సర్స్ అసోసియేషన్‌లో అం తర్గత వర్గ విభేదాలు ఒక్కసారిగా తీవ్ర రూపం దాల్చాయి. హైదరాబాద్ లోని ఫిల్మ్ ఫెడరేషన్ ఆఫీస్ ప్రాంగణంలోనే ఇరు వర్గాల డ్యాన్సర్లు పరస్పరం ఘర్షణకు దిగడంతో ఉద్రిక్త

- మిగతా 2లో

## సీఈసీకి తెలిసే రిగ్గింగ్ జరిగితే...!

**ఎన్నికల కమిషన్‌పై ప్రియాంక గాంధీ తీవ్ర వ్యాఖ్యలు**



- ఎన్నికల రిగ్గింగ్ గురించి తెలిసి సీఈసీ అనుమతిస్తే దేశద్రోహమని వ్యాఖ్య
- ఈసీలో అవకతవకలపై వస్తున్న కథనాలు అత్యంత తీవ్రమైనవని వ్యాఖ్య
- ఈ ఘటనపై సరైన దర్యాప్తు జరిపి బాధ్యులను శిక్షించాలని డిమాండ్

- మిగతా 2లో



## బీజేపీలో భారీ మార్పులు..

**28 రాష్ట్రాలు, 8 కేంద్రపాలిత ప్రాంతాలకు కొత్త ఇంచార్జ్‌లు**

- ఏపీ బీజేపీ ఇంచార్జ్‌గా అర్వింద్ భదౌరియా
- తెలంగాణ ఇంచార్జ్‌గా సునీల్ భన్సల్
- ఒడిశా ఇంచార్జ్‌గా పురందేశ్వరి

- మిగతా 2లో

## అంబానీని వెనక్కి నెట్టిన అదానీ.. తగ్గిన ముఖేశ్ అంబానీ సంపద!

- మళ్లీ భారత్ కుబేరుడిగా గౌతమ్ అదానీ
- ముఖేశ్ అంబానీని వెనక్కి నెట్టి అగ్రస్థానం కైవసం
- వీ3వీ హురున్ ఇండియా రిచ్ లిస్ట్ 2026లో వెల్లడి
- జాబితాలో పెరిగిన మహిళా సంపన్నుల సంఖ్య
- ఏఐ, టెక్ రంగాల నుంచి కొత్త కుబేరుల వెల్లువ



పెన్ పవర్ డెస్క్:భారత సంపన్నుల జాబితాలో కీలక మార్పు చోటుచేసుకుంది. ముఖేశ్ అంబానీని అధిగమించి, గౌతమ్ అదానీ మరోసారి దేశంలోనే అత్యంత సంపన్నుడిగా అగ్రస్థానాన్ని కైవసం చేసుకున్నారు. 'వీ3వీ హురున్ ఇండియా రిచ్ లిస్ట్ 2026' ఈ వివరాలను వెల్లడించింది. ఈ నివేదిక ప్రకారం, గౌతమ్ అదానీ, ఆయన కుటుంబం సంపద 13 శాతం వృద్ధితో రూ. 9.23 లక్షల కోట్లకు చేరింది. అదే సమయంలో, ముఖేశ్ అంబానీ సంపద 10 శాతం తగ్గి రూ. 8.63 లక్షల కోట్లకు పరిమితమైంది. దీంతో అదానీ సుమారు రూ. 59,400 కోట్ల ఆధిక్యంతో

- మిగతా 2లో



తిరుమలలో వైభవంగా

## చక్రస్నానం..

**ముగిసిన శ్రీవారి బ్రహ్మోత్సవాలు**

- శ్రీవారి బ్రహ్మోత్సవాల ముగింపు నేడు చక్రస్నానం
- పవిత్ర పుష్కరిణిలో పుణ్యస్నానాలాచరించిన వేలాది మంది భక్తులు
- మలయప్ప స్వామి, సుదర్శన చక్రత్తాళ్వార్లకు శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనం
- 8 రోజుల్లో 5.76 లక్షల మందికి శ్రీవారి దర్శనం కల్పించినట్లు తెలిపిన టీటీడీ
- సీఎం చంద్రబాబు మార్గదర్శకత్వంలో ఉత్సవాలు విజయవంతం చేశామన్న బీఆర్ నాయుడు

- మిగతా 2లో

## ఉత్తరాంధ్రకు తీవ్ర వాయుగుండం ముప్పు.. సీఎం చంద్రబాబు సమీక్ష



- శ్రీకాకుళం-కవిటి మధ్య తీరం దాటనున్న వాయుగుండం
- ఉత్తరాంధ్ర జిల్లాలకు భారీ నుంచి అతి భారీ వర్షాల సూచన
- గంటకు 85 కి.మీ వేగంతో గాలులు వీచే అవకాశం
- యంత్రాంగాన్ని అప్రమత్తం చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు

- మిగతా 2లో

## సాంకేతికతను అందిపుచ్చుకునే బాధ్యత

# యువతరానిదే

- అమరావతిని ప్రపంచం మెచ్చే నగరంగా తీర్చిదిద్దుతాం
- ఎల్వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్‌కు 12 ఎకరాలు కేటాయింపు
- రూ.60 వేల కోట్లతో రాజధానిలో రోడ్ల నిర్మాణం
- అమరావతిలో హెల్త్‌కేర్ హబ్, క్వాంటమ్ వ్యాలీ ఏర్పాటు
- ఏఐ, డేటా సెంటర్లు, డీప్‌టెక్ రంగాలకు ప్రాధాన్యం
- ప్రతి ఆవిష్కరణకు అమరావతే వేదిక కావాలి
- సాంకేతికతను అందిపుచ్చుకోవడంలో యువత ముందుండాలి



**పెన్ పవర్ డెస్క్:** ప్రపంచమంతా మెచ్చే నగరంగా అమరావతి మారుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. తుళ్లూరు మండలం అబ్బరాజుపాలెం వద్ద ఎల్వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ ఫౌండేషన్ కార్యక్రమంలో సీఎం పాల్గొని భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. రాజధానిలో నిర్మించే ఎల్వీ ప్రసాద్ ఇనిస్టిట్యూట్ ప్రపంచంలోనే నంబర్ వన్ కావాలని ఆకాంక్షించారు. ఈ ఇనిస్టిట్యూట్‌కి 12 ఎకరాలు కేటాయించినట్లు తెలిపారు. "అమరావతికి అనేక ఉన్నత విద్యాసంస్థలు వచ్చాయి.. వస్తున్నాయి. రూ. 60వేల కోట్లతో రోడ్లు నిర్మిస్తున్నాం. రాజధానికి స్పోర్ట్స్ సిటీ, విమానాశ్రయం వస్తాయి. అమరావతి హెల్త్ కేర్ హబ్‌గా మారుతుంది. క్వాంటమ్ వ్యాలీ, గ్రీన్ హైడ్రోజన్.. గేమ్ ఛేంజర్స్ అవుతాయి. ప్రపంచంలో ఆరు దేశాల్లోనే క్వాంటమ్ ఉంది.. అమరావతికీ వస్తుంది. 21 కంపెనీలు స్టార్టప్‌లతో ముందుకొచ్చాయి. ఏఐ, డేటా

- మిగతా 2లో

### రౌడీ గ్యాంగ్‌తో జగన్ అరాచకాలు చేయిస్తున్నారు: చంద్రబాబు

అమరావతి: స్థానిక సంస్థల ఎన్నికలకు ఎస్ఈసీ ఎప్పుడు షెడ్యూల్ ప్రకటించినా ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. కూటమి పార్టీల మధ్య సమన్వయం, ఐక్యతను మరింత బలోపేతం చేయాలని ఇన్‌ఛార్జ్ మంత్రులకు సూచించారు. స్థానిక సంస్థల్లో అన్ని స్థానాల్లో కూటమి అభ్యర్థులను గెలిపించుకుని వచ్చే బాధ్యతను ఇన్‌ఛార్జి మంత్రులు తీసుకోవాలని స్పష్టం చేశారు. కేబినెట్ భేటీ తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు.. మంత్రులకు ఎలక్షన్

- మిగతా 2లో



## ఉద్యోగులకు డబుల్ బొనాంజా, కొత్తగా 4 పోలీస్ కమిషనరేట్లు..

## ఏపీ క్యాబినెట్ నిర్ణయాలు

- ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన కీలక నిర్ణయాలు తీసుకున్న రాష్ట్ర మంత్రివర్గం
- రాష్ట్రానికి రూ.22,171.84 కోట్ల భారీ పెట్టుబడులకు ఆమోదం, 19,739 మందికి ఉపాధి
- మచిలీపట్నంలో రూ.8,000 కోట్లతో గోవా షిప్‌యార్డ్ ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్
- తిరుపతి, గుంటూరు, కర్నూలు, రాజమహేంద్రవరంలో కొత్త పోలీస్ కమిషనరేట్ల ఏర్పాటు
- ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు రెండు విడతల డీఏల మంజూరుకు ఆమోదముద్ర

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి పథంలో పరుగులు పెట్టించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం సంచలన నిర్ణయాలు తీసుకుంది. బుధవారం సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం, రాష్ట్ర భవిష్యత్‌ను నిర్దేశించే అనేక కీలక ప్రతిపాదనలకు ఆమోదముద్ర వేసింది. కేవలం ఒక్క సమావేశంలోనే ఏకంగా రూ. 22,171.84 కోట్ల విలువైన భారీ పెట్టుబడులకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం ద్వారా, రాష్ట్రాన్ని పెట్టుబడులకు స్వర్గధామంగా మార్చాలనే ప్రభుత్వ సంకల్పాన్ని చాటిచెప్పింది. ఈ పెట్టుబడుల ద్వారా సుమారు 19,739 మంది యువతకు ప్రత్యక్షంగా ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ముఖ్యంగా ఉద్యోగులకు రెండు డీఏలకు ఆమోదం తెలపడంతోటు, రాష్ట్రంలో కొత్తగా 4 పోలీస్ కమిషనరేట్ల ఏర్పాటుపై నిర్ణయం తీసుకున్నారు. క్యాబినెట్ సమావేశానంతరం మంత్రి కొలుసు పార్థసారథి మీడియాకు కేబినెట్ నిర్ణయాలను వెల్లడించారు.

**జగన్ పై మంత్రి ఫైర్**

ఈ సందర్భంగా మంత్రి కొలుసు పార్థసారథి, గత వైసీపీ ప్రభుత్వంపై, మాజీ ముఖ్యమంత్రి జగన్ పై తీవ్రస్థాయిలో

- మిగతా 2లో

## టీడీపీ ఆఫీస్‌పై దాడి కేసు: వైసీపీ కీలక నేతలపై రౌడీ షీట్లు!



- టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో 51 మందిపై రౌడీ షీట్లు
- వైసీపీ ఎమ్మెల్సీలు తలశిల రఘురాం, లెల్ల అప్పిరెడ్డి, నేత దేవినేని అవినాష్ పేర్లు
- 2021 అక్టోబర్‌లో జరిగిన ఘటనపై ప్రస్తుత ప్రభుత్వంలో సీఐడీ విచారణ
- ఎన్టీఆర్ పోలీస్ కమిషనర్ ఆదేశాలతో 9 పోలీస్ స్టేషన్లలో షీట్ల నమోదు
- చంద్రబాబు నివాసంపై దాడి కేసును కూడా సీఐడీకి అప్పగించిన ప్రభుత్వం

- మిగతా 2లో

## చంద్రబాబు 99 పైసలకే తనకు కావాల్సిన వారికి అత్యంత విలువైన భూములు కేటాయిస్తున్నారు

- విశాఖ వైసీపీ నేతలతో సమావేశమైన జగన్
- కూటమి ప్రభుత్వంలో అడ్డగోలుగా భూములు పంచుకుంటున్నారని ఆరోపణ
- ప్రతి గ్రామంలో మంద్యం, గంజాయి విచ్చలవిడిగా దొరుకుతోందని మండిపాటు



పెన్ పవర్ డెస్క్:వైసీపీ అధినేత జగన్ ఈరోజు విశాఖపట్నానికి చెందిన పార్టీ నేతలతో తాడేపల్లిలోని కేంద్ర కార్యాలయంలో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు.రాష్ట్రంలో రూపాయికి చాక్లెట్ వస్తుందో లేదో తెలియదు కానీ, ముఖ్యమంత్రి చంద్రబాబు 99 పైసలకే తనకు కావాల్సిన వారికి అత్యంత విలువైన భూములను కేటాయిస్తున్నారని విమర్శించారు. గీతం యూనివర్సిటీ పేరుతో 55 ఎకరాల భూమిని కేటాయించారంటే

- మిగతా 2లో

# టీడీపీ ఆఫీస్‌పై దాడి కేసు: వైసీపీ కీలక నేతలపై రౌడీ షీట్లు!

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో సంచలనం సృష్టించిన టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో పోలీసుల దర్యాప్తు వేగవంతమైంది. ఈ కేసుకు సంబంధించి వైసీపీకి చెందిన పలువురు కీలక నేతలు సహా మొత్తం 51 మందిపై రౌడీ షీట్లు తెరవాలని ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు ఆదేశాలు జారీ చేశారు. ఈ జాబితాలో వైసీపీ ఎమ్మెల్సీలు తలశిల రఘురాం, లెల్ల అప్పిరెడ్డి, ఎన్టీఆర్ జిల్లా వైసీపీ అధ్యక్షుడు దేవినేని అవినాశ్ వంటి ప్రముఖుల పేర్లు ఉండటం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది.వివరాల్లోకి వెళితే, 2021 అక్టోబర్ 19న గుంటూరు జిల్లా మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంపై పెద్ద ఎత్తున దాడి జరిగింది. ఈ ఘటనపై తాజాగా ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని తొమ్మిది పోలీస్ స్టేషన్ల ఎస్హెచ్ఓలకు రౌడీ షీట్లు తెరవాలని కమిషనర్ ఆదేశించారు. ఈ ప్రక్రియను వ్యక్తిగతంగా పర్యవేక్షించాలని అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ఏసీపీ)లకు స్పష్టమైన సూచనలు జారీ చేశారు.

గతంలో వైసీపీ అధికారంలో ఉండగా ఈ దాడి జరిగింది. అప్పటి ముఖ్యమంత్రి జగన్ ను ఉద్దేశించి టీడీపీ అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరామ్ అనుచిత వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలతో వైసీపీ మద్దతుదారులు పెద్ద సంఖ్యలో టీడీపీ కార్యాలయానికి చేరుకున్నారు. కర్రలు, సుత్తులతో కార్యాలయంలోకి చొరబడి ఫర్నిచర్, కిటికీ అద్దాలు ధ్వంసం చేశారు. ఆవరణలో నిలిపి ఉంచిన కార్లను కూడా ధ్వంసం చేశారని టీడీపీ నేతలు ఆరోపించారు.

ఈ ఘటనపై మంగళగిరి రూరల్ పోలీస్ స్టేషన్‌లో తలశిల రఘురాం, దేవినేని అవినాశ్, లేళ్ల అప్పిరెడ్డి, వైసీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి సహా మొత్తం 110 మందిపై కేసు నమోదైంది. ఐపీసీ సెక్షన్లు 147, 148, 323, 324, 326, 307, 380, 427, 459, 452, 506 రెడ్ విత్ 109, 120-బి, 149 కింద కేసు నమోదు చేసి

దర్యాప్తు చేపట్టారు. 2024 జూన్‌లో టీడీపీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ కేసుపై మళ్లీ దృష్టి సారించింది.

2024 అక్టోబర్ లో ఈ కేసు దర్యాప్తును రాష్ట్ర ప్రభుత్వం సీఐడీకి అప్పగించింది. దీంతో పాటు 2021 సెప్టెంబర్‌లో చంద్రబాబు నివాసంపై జరిగిన దాడి కేసును కూడా సీఐడీ విచారణకు బదిలీ చేసింది. తాజా పరిణామాలతో పాత కేసుల దర్యాప్తులో వేగం పుంజుకోవడం, వైసీపీ నేతలపై రౌడీ షీట్లు తెరవడం రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.

# ఎడిటర్ వ్యూ

## న్యూక్లియర్ ఫ్యూజన్ లో భారత్ ముందడుగు

న్యూక్లియర్ ఫ్యూజన్ ఎనర్జీ రంగంలో భారత్ మరో మైలురాయిని అధిగమించింది. సూర్యుడి కేంద్రం కన్నా 20 రెట్ల వేడి ప్లాస్మాను సృష్టించారు. గుజరాత్‌లోని ప్లాస్మా రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(ఐపీఆర్)కు చెందిన ఆదిత్య-1 టోకామాక్‌పై కొత్త శక్తివంతమైన గైరో ట్రాన్ వ్యవస్థను విజయవంతంగా ప్రారంభించారు. ఇది 82.6 గిగాహెర్ట్జ్ ఫ్రీక్వెన్సీ, 400 కిలోవాట్ల సామర్థ్యంతో పనిచేస్తుంది. టోకామాక్‌లోని అత్యంత వేడి ప్లాస్మాను మరింత వేడి చేయడానికి ఈ కొత్త పరికరం ఉపయోగపడుతుంది.స్టడీ స్టేట్ సూపర్‌కండక్టింగ్ టోకామాక్ అనే పరికరం, నియంత్రిత పద్ధతుల్లో సూర్యుడిపై జరిగే న్యూక్లియర్ ఫ్యూజన్ ప్రక్రియను నిర్వహిస్తుంది. టోకామాక్‌లోని బలమైన అయస్కాంత క్షేత్రం ప్లాస్మాను నియంత్రిస్తుంది. తాజా పరిశోధనల్లో ప్లాస్మా ఉష్ణోగ్రత 20 కోట్ల డిగ్రీల సెల్సియస్ కంటే ఎక్కువగా చేరింది. ఇది సూర్యుడి కేంద్రంలో ఉత్పత్తి అవుతున్న వేడి కన్నా దాదాపు 10-20 రెట్లు ఎక్కువ.గైరో ట్రాన్ అనేది అధిక ఫ్రీక్వెన్సీ మైక్రోవేవ్ శక్తిని ఉత్పత్తి చేసే ప్రత్యేక పరికరం. ఈ శక్తిని టోకామాక్‌లోని ప్లాస్మాలోకి పంపించడం ద్వారా దాని ఉష్ణోగ్రతను మరింత పెంచుతారు. ఆదిత్య-1లో ఇంతకుముందు 42 గిగాహెర్ట్జ్ జైరోట్రాన్ వ్యవస్థను ఉపయోగించారు. ఇప్పుడు ఏర్పాటు చేసిన 82.6 గిగాహెర్ట్జ్ వ్యవస్థ అధిక సామర్థ్యంతో ప్లాస్మాను వేడి చేయడానికి సహాయపడుతుంది.ఫ్యూజన్ ప్రక్రియలో ప్లాస్మాను అత్యంత వేడికి చేర్చడమే కాకుండా, దానిని తగిన సమయం పాటు స్థిరంగా ఉంచడం కూడా అత్యంత కీలకం. కొత్త గైరో ట్రాన్ ఈ ప్రయోగాన్ని సమర్థవంతంగా నిర్వహించేందుకు సైంటిస్టులకు ఉపయోగపడింది.ఫ్యూజన్ (కేంద్ర సంలీన చర్య) ముఖ్యంగా సూర్యుడి వంటి నక్షత్రాల్లో జరుగుతుంది. దీని వల్ల అపారమైన శక్తి వెలువడుతుంది. స్వచ్ఛమైన భారీ స్థాయిలో శక్తిని అందించగల సామర్థ్యం దీని సొంతం. ఇందులో హైడ్రోజన్ ఐసోటోపులను ఇంధనంగా ఉపయోగించే అవకాశం ఉంది. హైడ్రోజన్ ఐసోటోపులు ఢీకొని హీలియంగా మారి, భారీ శక్తి విడుదల అవుతుందిప్రస్తుతం సాంప్రదాయ అణు విద్యుత్ కేంద్రాల్లో జరిగే న్యూక్లియన్ ఫిజన్(కేంద్ర విచ్ఛిత్తి చర్య) వల్ల యురేనియం లేదా ప్లూటోనియం ఢీకొట్టుకోవడం వల్ల చిన్న కేంద్రకాలుగా విడిపోతుంది. దీని వల్ల శక్తి విడుదల అవుతుంది. ఫిషన్‌తో పోలిస్తే ఫ్యూజన్ చర్యలో దీర్ఘకాలికంగా నిల్వ చేయాల్సిన రేడియోధార్మిక వ్యర్థాల సమస్య తక్కువగా ఉండే అవకాశం ఉంటుంది. తక్కువ ఇంధనంతో భారీ శక్తిని ఉత్పత్తి చేయవచ్చు.అణు రియాక్టర్లలో న్యూక్లియన్ ఫిషన్ చర్య ఒక విచ్ఛిత్తి మరో విచ్ఛిత్తికి దారి తీసే చైన్ రియాక్షన్ ఉంటుంది. ఫ్యూజన్‌లో ప్లాస్మా పరిస్థితులు కొనసాగకుంటే ఫ్యూజన్ చర్య వెంటనే స్వయంగా ఆగిపోతోంది. దీని వల్ల పెద్ద ప్రమాదాలు ఉదాహరణకు చెర్నోబిల్ వంటి ప్రమాదాలు ఉండవు. ఫ్యూజన్ చర్యలో విడుదలయ్యే హీలియం రేడియో యాక్టివ్ కాదు. అణు వ్యర్థాల సమస్యే ఉండదు.

# ఉద్యోగులకు డబుల్ బొనాంజా, కొత్తగా 4 పోలీస్ కమిషనరేట్లు..

- మొదటి పేజీ తరువాయి

విరుచుకుపడ్డారు. "ఒకవైపు చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేశ్ అహర్నిశలు శ్రమిస్తూ, రాష్ట్రాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లాలని ప్రయత్నిస్తుంటే, మరోవైపు ఐదేళ్ల విఫల నాయకుడు జగన్ రాష్ట్రంలో విధ్వంసం, అలజడి సృష్టించి పెట్టుబడిదారులను భయపెట్టాలని చూస్తున్నారు. గొడ్డలి పార్టీ నాయకుడి చర్యలు అత్యంత శోచనీయం. ప్రజాస్వామ్యాన్ని, ప్రజాతీర్పును గౌరవించకుండా అసెంబ్లీకి రాకుండా, తన ఇంటినే అసెంబ్లీగా మార్చుకుని, సొంత పత్రిక ద్వారా అబద్ధాలను ప్రచారం చేస్తున్నారు. ఇలాంటి రాజకీయ పరిస్థితి దేశంలో మరే రాష్ట్రంలోనూ ఉండదు" అని పార్థసారథి తీవ్రంగా ధ్వజమెత్తారు .డీఎస్సీ నియామకాల విషయంలో కూడా చిన్న సమస్యలను పట్టుకుని యువతను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారని ఆయన ఆరోపించారు. ఎన్ని కుట్రలు పన్నినా, కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని అత్యున్నత స్థానానికి తీసుకెళ్లి తీరుతుందని ఆయన స్పష్టం చేశారు.

### కృష్ణా జిల్లాకు వరం.. మచిలీపట్నంలో గోవా షిప్‌యార్డ్

కేబినెట్ నిర్ణయాల్లో అత్యంత కీలకమైనది కృష్ణా జిల్లాకు దక్కిన భారీ వరం. రక్షణ రంగంలో ప్రఖ్యాత ప్రభుత్వ రంగ సంస్థ అయిన గోవా షిప్‌యార్డ్, మచిలీపట్నంలో తమ నౌకా నిర్మాణ యూనిట్‌ను ఏర్పాటు చేయనుంది. ఇందుకోసం రూ.8,000 కోట్ల భారీ పెట్టుబడి పెట్టనుంది. ప్రభుత్వం ఈ సంస్థకు 400 ఎకరాల భూమిని, 1.7 కిలోమీటర్ల సముద్ర తీరాన్ని కేటాయించింది. ఇప్పటికే రూ.30,000 కోట్ల ఆర్డర్లతో ఉన్న ఈ సంస్థ వెంటనే పనులు ప్రారంభించేందుకు సిద్ధంగా ఉందని, దీనివల్ల ఒకవైపు పోర్టు, మరోవైపు షిప్ మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్లతో కృష్ణా జిల్లా స్వరూపమే మారిపోతుందని మంత్రి పార్థసారథి హర్షం వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టు సాధనలో కృషి చేసిన సీఎం చంద్రబాబు, లోకేశ్, పవన్ కల్యాణ్ కు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

### పారిశ్రామిక, శాంతిభద్రతలపై కీలక నిర్ణయాలు

పరిశ్రమలకు పెద్దపీట: ఎలక్ట్రానిక్స్ రంగంలో అగ్రగామి సంస్థ 'డిక్సన్', గత ప్రభుత్వ హయాంలో ఎంఓయూ చేసుకుని వెనక్కి వెళ్లిందని, ఇప్పుడు కూటమి ప్రభుత్వంపై నమ్మకంతో మళ్లీ ముందుకు వచ్చిందని మంత్రి తెలిపారు. క్వాంటం కంప్యూటింగ్ రంగంలో రాష్ట్రాన్ని హబ్‌గా మార్చే 'క్వాంటం వ్యాలీ' ఏర్పాటుకు ప్రభుత్వం వసతులు కల్పించనుంది.కొత్త పోలీస్ కమిషనరేట్లు: రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణకు, మారుతున్న నేరాల స్వరూపాన్ని ఎదుర్కొనేందుకు తిరుపతి, గుంటూరు, కర్నూలు, రాజమహేంద్రవరం కేంద్రాలుగా నాలుగు కొత్త పోలీస్ కమిషనరేట్లను ఏర్పాటు చేయాలని కేబినెట్ నిర్ణయించింది. ఐజీ/డీఐజీ స్థాయి అధికారి కమిషనర్‌గా వ్యవహరిస్తారు. దీంతోపాటు సైబర్, సోషల్ మీడియా నేరాలను అరికట్టేందుకు ప్రతి జిల్లాలో 20 మందితో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయనున్నారు.ఉద్యోగులకు డబుల్ బొనాంజా: ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు సీఎం చంద్రబాబు తీపికబురు అందించారు. వారికి 1.7.2024 నుంచి 2.73%, 1.1.2025 నుంచి 1.82% చొప్పున రెండు విడతల కరవు భత్యం (డీఏ) మంజూరు చేస్తూ జారీ చేసిన ఉత్తర్వులకు కేబినెట్ ఆమోదం తెలిపింది.

### అమరావతి పునరుజ్జీవం.. రైతులకు న్యాయం

అసెంబ్లీకి రూ.661 కోట్లు: అమరావతిలో ప్రపంచస్థాయి ప్రమాణాలతో, తెలుగు ప్రజలు గర్వపడేలా శాసనసభ భవనం నిర్మించేందుకు రూ.661 కోట్లతో పరిపాలన అనుమతులు మంజూరు చేశారు. రాజధానిలోని గ్రామ పంచాయతీల్లో మౌలిక వసతుల కోసం మరో రూ.1,543.98 కోట్లను కేటాయించారు.చిన్న రైతులకు భరోసా: భూ సమీకరణ పథకం కింద ఎకరం కంటే తక్కువ భూమి ఇచ్చిన రైతులకు కూడా ఎకరాకు వర్తించే విధంగా వార్షిక కౌలు (యాన్యుటీ) చెల్లించేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇది రాజధాని రైతులకు ఎంతో ఊరటనిచ్చే నిర్ణయం.

### ఇతర ముఖ్యమైన నిర్ణయాలు

మద్యం పాలసీ: మద్యం దుకాణాల లైసెన్సులను పునరుద్ధరిస్తూ, ఎమ్మార్పీ ఉల్లంఘనలపై కఠినంగా వ్యవహరించాలని సీఎం ఆదేశించారు. తొలిసారి ఉల్లంఘిస్తే రూ.10 లక్షల జరిమానా, రెండోసారి లైసెన్స్ రద్దు చేయాలని నిర్ణయించారు.

షుగర్ ఫ్యాక్టరీల పునరుద్ధరణ: మూతపడిన సహకార చక్కెర కర్మాగారాల (చోడవరం, గోవాడ మొదలైనవి) సమస్యల పరిష్కారానికి, రైతులకు, కార్మికులకు బకాయిలు చెల్లించేందుకు ప్రభుత్వం రుణం ఇచ్చే ప్రతిపాదనకు ఆమోదం తెలిపారు.

సామాజిక మీడియా పాలసీ: ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు 'సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్స్ పాలసీ'కి ఆమోదం తెలిపారు. ఫాలోవర్ల సంఖ్య ఆధారంగా వారికి పారితోషికం చెల్లిస్తారు.

న్యాయాధికారుల పదవీ విరమణ: న్యాయాధికారుల పదవీ విరమణ వయసును 61 నుంచి 62 ఏళ్లకు పెంచుతూ ఆర్డినెన్స్ ముసాయిదాకు ఆమోదం తెలిపారు.

భూ కేటాయింపులు: సాగర్మాల ప్రాజెక్టుల కింద భూసేకరణకు ఏపీఐఐసీకి రూ.2,500 కోట్ల టర్మ్ లోన్ వినియోగానికి, విజయనగరంలో మిల్లెట్ల ప్రాసెసింగ్ యూనిట్ కోసం డీఆర్‌డీఏకు ఉచితంగా భూమి కేటాయింపు వంటి అనేక నిర్ణయాలు తీసుకున్నారు.

సచివాలయ ఉద్యోగుల ప్రమోషన్లు: వార్డు సచివాలయాల్లోని పలు కేటగిరీల ఉద్యోగులకు ప్రమోషన్ అవకాశాలు కల్పించేందుకు, ప్రత్యేక సర్వీస్ రూల్స్ రూపొందించే ప్రతిపాదనకు కేబినెట్ ఆమోదం తెలిపింది. మొత్తంమీద, ఈ కేబినెట్ సమావేశం ద్వారా కూటమి ప్రభుత్వం ఒకవైపు పారిశ్రామిక అభివృద్ధికి పెద్దపీట వేస్తూనే, మరోవైపు ఉద్యోగ, రైత, ప్రజా సంక్షేమానికి, పరిపాలన సంస్కరణలకు కట్టుబడి ఉన్నామని స్పష్టమైన సందేశాన్ని పంపింది.

# తిరుమలలో వైభవంగా చక్రస్నానం..

కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామివారి వార్షిక సాలకట్ల బ్రహ్మోత్సవాలు బుధవారం నాడు చక్రస్నానంతో కన్నులపండువగా ముగిశాయి. సెప్టెంబర్ 15 నుంచి 23 వరకు తొమ్మిది రోజుల పాటు అంగరంగ వైభవంగా జరిగిన ఈ ఉత్సవాల చివరి రోజున స్వామి పుష్కరిణిలో నిర్వహించిన చక్రస్నానం ఘట్టంతో బ్రహ్మోత్సవాలకు పరిసమాప్తి పలికారు.

అంతకుముందు, ఉదయం 3 గంటల నుంచి 6 గంటల వరకు శ్రీవారికి సర్వభూపాల పల్లకి ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం ఉదయం 6 నుంచి 9 గంటల వరకు శ్రీ భూవరాహ స్వామి ఆలయ ప్రాంగణంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్ప స్వామికి, సుదర్శన చక్రత్తాళ్వార్‌కు వైఖానస ఆగమోక్తంగా స్నపన తిరుమంజనం చేపట్టారు. విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనంతో ప్రారంభమైన ఈ కార్యక్రమంలో పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనం వంటి సుగంధ ద్రవ్యాలతో శంఖులు, కలశాల ద్వారా అభిషేకం చేశారు. ఈ సమయంలో వేద పండితులు ఉపనిషత్తులు, పంచ సూక్తాలు (పురుష, శ్రీ, భూ, నీలా, విష్ణు) పఠించగా, జీయర్ స్వాముల సమక్షంలో దివ్య ప్రబంధ పారాయణం నిర్వహించారు.అభిషేకం అనంతరం, సుదర్శన చక్రత్తాళ్వార్‌ను ఊరేగింపుగా స్వామి పుష్కరిణి వద్దకు తీసుకొచ్చి, వేదమంత్రాల ఘోష నడుమ పవిత్ర జలాల్లో స్నానం చేయించారు. అదే శుభ సమయంలో, "గోవిందా... గోవిందా..." అంటూ భక్తి పారవశ్యంతో నామస్మరణ చేస్తూ, పుష్కరిణి వద్ద వేచి ఉన్న వేలాది మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. సుదర్శన చక్రం స్పృశించిన జలాల్లో స్నానం చేయడం వల్ల సకల శుభాలు కలుగుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం.

ఆగమశాస్త్రం ప్రకారం, బ్రహ్మోత్సవాలను ఒక మహాయజ్ఞంగా పరిగణిస్తారు. ఉత్సవాల నిర్వహణలో ఏవైనా లోటుపాట్లు జరిగితే, ఈ చక్రస్నానం (అవభృథ స్నానం) ద్వారా అవి తొలగిపోయి, భక్తులకు, లోకానికి సంపూర్ణ ఫలం, శాంతి, శ్రేయస్సు కలుగుతాయని నమ్మకం.

### విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు: టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు

ఈ సందర్భంగా టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి నిరంతర మార్గదర్శకత్వంతోనే బ్రహ్మోత్సవాలు విజయవంతమయ్యాయని తెలిపారు. భక్తులకు

ఎలాంటి అసౌకర్యం కలగకుండా దర్శనం, వసతి, అన్నప్రసాదం, పారిశుద్ధ్యం, భద్రత వంటి అంశాలపై సీఎం సూచనలతో క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టామన్నారు. గత 8 రోజుల్లో 5.76 లక్షల మంది భక్తులకు శ్రీవారి దర్శనం కల్పించామని, ప్రతి భక్తుడు సంతృప్తిగా దర్శనం చేసుకునేలా సమష్టిగా పనిచేశామని వివరించారు. ఈ విజయానికి సహకరించిన అర్చకులు, అధికారులు, ఉద్యోగులు, పోలీసులు, జిల్లా యంత్రాంగం, శ్రీవారి సేవకులు, మీడియా ప్రతినిధులు సహా ప్రతి ఒక్కరికీ ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. భక్తుల సేవే తమ ప్రథమ కర్తవ్యమని, శ్రీవారి ఆశీస్సులతో భవిష్యత్తులో మరింత మెరుగైన సేవలు అందిస్తామని ఆయన స్పష్టం చేశారు.

# డ్యాన్సర్స్ అసోసియేషన్‌లో కొట్లాట..

- మొదటి పేజీ తరువాయి

పరిస్థితులు నెలకొన్నాయి. అసోసియేషన్ 'మినిట్స్ బుక్' దక్కించుకునే క్రమంలో ప్రస్తుత అధ్యక్షురాలు, జానీ మాస్టర్ భార్య సుమలత, కొరియోగ్రాఫర్ రఘు మాస్టర్ వర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం, తోపులాట చోటుచేసుకుంది. ఈ గొడవ ముదిరి రెండు వర్గాల మధ్య ఘర్షణకు దారితీసింది. అసోసియేషన్ కు సంబంధం లేని వ్యక్తులు కుట్రతో తమపై దాడి చేశారని సుమలత ఆరోపించింది. సుమలత మనుషులే తమపై దాడి చేశారంటూ రఘు మాస్టర్ వర్గం పేర్కొంది. ఈ ఘటనపై ఇరువర్గాలు బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. సుమలత తీరుపై ఆగ్రహంతో ఉన్న కొందరు తోటి డ్యాన్సర్లు ఆమె ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అసలు ఈ గొడవకు కారణం.. అంతకుముందు తెలుగు ఫిలిం ఫెడరేషన్ తీసుకున్న ఒక సంచలన నిర్ణయం.. డ్యాన్సర్స్ అసోసియేషన్‌లో నెలకొన్న సమస్యలను తేల్చేందుకు ఫెడరేషన్ పెద్దలు సుమలత, రఘు మాస్టర్ సమక్షంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మొత్తం 225 మంది సినీ డ్యాన్సర్లు హాజరైన ఈ మీటింగ్‌లో ప్రజాస్వామ్యబద్ధంగా అభిప్రాయ సేకరణ జరిపారు.

ఈ ఓటింగ్‌లో ఏకంగా 214 మంది డ్యాన్సర్లు రఘు మాస్టర్‌కే మద్దతు తెలపగా.. సుమలత వైపు కేవలం 11 మంది మాత్రమే నిలిచారు.

దీంతో మెజారిటీ నిర్ణయం మేరకు సుమలత నేతృత్వంలోని కార్యవర్గాన్ని రద్దు చేస్తున్నట్లు ఫెడరేషన్ ప్రకటించింది. అంతేకాకుండా, అక్టోబర్ 11న అసోసియేషన్ నూతన ఎన్నికలు నిర్వహిస్తామని షెడ్యూల్ విడుదల చేసింది.

ఫెడరేషన్ తీసుకున్న ఈ ఊహించని షాకింగ్ నిర్ణయం, ఎన్నికల షెడ్యూల్‌తో డ్యాన్సర్ల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. ఏకంగా ఫిల్మ్ ఛాంబర్‌లోనే దాడికి పాల్పడేంతగా వివాదం చెలరేగడంతో అక్టోబర్ 11న జరగబోయే ఎన్నికలు ఇంకెన్ని మలుపులు తిరుగుతాయోనని ఇండస్ట్రీ వర్గాలు ఉత్కంఠగా గమనిస్తున్నాయి.

# బీజేపీలో భారీ మార్పులు..

రాబోయే అసెంబ్లీ, సార్వత్రిక ఎన్నికల్లో విజయమే ఏకైక లక్ష్యంగా బీజేపీ అధినాయకత్వం పార్టీ సంస్థాగత యంత్రాంగాన్ని భారీగా ప్రక్షాళన చేసింది. దేశవ్యాప్తంగా 28 రాష్ట్రాలు, 8 కేంద్రపాలిత ప్రాంతాలకు కొత్త ఇంచార్జ్‌లు, సహ-ఇంచార్జ్‌ల జాబితాను బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ అధికారికంగా ప్రకటించారు. ప్రాంతీయ రాజకీయ సమీకరణలు, ఎన్నికల వ్యూహాలను ప్రామాణికంగా తీసుకుని కీలక నేతలకు ఈ బాధ్యతలు కట్టబెట్టారు. తెలంగాణ: సునీల్ భన్సల్ ఇంచార్జ్‌గా వ్యవహరించనుండగా, అభయ్ పాటిల్, రేఖా శర్మ సహ-ఇంచార్జ్‌లుగా నియమితులయ్యారు. (సునీల్ భన్సల్ పశ్చిమ బెంగాల్ ఇంచార్జ్‌గా కూడా బాధ్యతలు నిర్వహిస్తారు).

ఆంధ్రప్రదేశ్: అర్వింద్ భదౌరియా ఇంచార్జ్‌గా, తమిళనాడు మాజీ ఎమ్మెల్యే వనతి శ్రీనివాసన్ సహ-ఇంచార్జ్‌గా వ్యవహరిస్తారు.

**తమిళనాడు:** రామ్ మాధవ్ ఇంచార్జ్‌గా ఎంపికవ్వగా, కో-ఇంచార్జ్‌లుగా డీకే అరుణ, నిర్మల్ కుమార్ సురానా బాధ్యతలు చేపట్టనున్నారు.

ఒడిశా: దగ్గుబాటి పురందేశ్వరి ఇంచార్జ్‌గా, డాక్టర్ స్వదేశ్ సింగ్ సహ-ఇంచార్జ్‌గా నియమితులయ్యారు.

కర్ణాటక: హరీశ్ ద్వివేది ఇంచార్జ్‌గా... తెలంగాణకు చెందిన డాక్టర్ కాసం వెంకటేశ్వర్లు సహ-ఇంచార్జ్‌గా ఎంపికయ్యారు.

ఉత్తర ప్రదేశ్: దేశ రాజకీయాల్లో అత్యంత ప్రాధాన్యత ఉన్న యూపీకి జాతీయ

ప్రధాన కార్యదర్శి వినోద్ తావ్డే ఇంచార్జ్‌గా ఎంపికయ్యారు. ఆయనకు తోడుగా నలుగురు సహ-ఇంచార్జ్‌లను కేటాయించారు.

మహారాష్ట్ర: బైజయంత్ జయ్ పాండా ఇంచార్జ్‌గా వ్యవహరిస్తారు. ఆయనకు సహాయంగా అమిత్ మాలవీయ, సదానంద్ షెట్ తనవాడే, కమల్‌జీత్ సెహ్రావత్‌లను సహ-ఇంచార్జ్‌లుగా నియమించారు.

ఛత్తీస్‌గఢ్ - హర్యానా: మాజీ కేంద్ర మంత్రి స్మృతి ఇరానీకి ఈ రెండు రాష్ట్రాల ఇంచార్జ్ బాధ్యతలను అప్పగించారు.

ఢిల్లీ: డాక్టర్ వినయ్ సహస్రబుద్ధే ఇంచార్జ్‌గా, జాంయాంగ్ త్సేరింగ్ నామ్‌గ్యాల్, దర్శనాబెన్ జర్దోష్‌లను కో-ఇంచార్జ్‌లుగా నియమించారు.

గుజరాత్: తరుణ్ చుగ్ ఇంచార్జ్ బాధ్యతలు చేపట్టనున్నారు.

హిమాచల్ ప్రదేశ్: శ్రీకాంత్ శర్మ ఇంచార్జ్‌గా వ్యవహరించనున్నారు.

మధ్యప్రదేశ్: మాజీ సీఎం బిప్లబ్ కుమార్ దేవ్ ఇంచార్జ్‌గా నియమితులయ్యారు.

# రౌడీ గ్యాంగ్‌తో జగన్ అరాచకాలు చేయిస్తున్నారు

- మొదటి పేజీ తరువాయి

టార్గెట్ నుంచి లా అండ్ ఆర్డర్ వరకు అన్ని అంశాలపై దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేసే వారిపై రైల్వే యాక్ట్ తరహాలో కఠిన చట్టం తీసుకురావాలని చంద్రబాబు అధికారులను ఆదేశించారు. రాజకీయ నాయకుల ముసుగులో అసాంఘిక శక్తులు విధ్వంసానికి పాల్పడుతున్నాయని, వైకాపా రౌడీ మూకలు అలజడి సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నాయని ధ్వజమెత్తారు. జగన్ బెంగళూరులో కూర్చుని రౌడీ గ్యాంగ్ ద్వారా ఏపీలో అరాచకాలు చేయిస్తున్నారని మండిపడ్డారు. లా అండ్ ఆర్డర్‌ను దెబ్బతీసే ఎలాంటి ప్రయత్నాన్నీ ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. శాప్ కార్యాలయం వద్ద జరిగిన దాడి ఘటన.. రాజకీయ ముసుగులో నేరాలకు పాల్పడిన తీరు బట్టబయలైందని చంద్రబాబు అన్నారు. శాప్ కార్యాలయం, టీడీపీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌పై జరిగిన దాడుల్లో ఒకే వ్యక్తులు ఉన్నారన్న అంశాన్ని ప్రస్తావించారు. వైసీపీ నేతలు జరగని విషయాలను జరిగినట్లుగా ప్రచారం చేయడంలో సిద్ధహస్తులని ఆరోపిస్తూ, ఉద్దేశపూర్వకంగా బురద చల్లే ప్రయత్నాలను తిప్పికొట్టాలని మంత్రులకు దిశానిర్దేశం చేశారు.

# సాంకేతికతను అందిపుచ్చుకునే బాధ్యత యువతరానిదే

- మొదటి పేజీ తరువాయి

సెంటర్, క్వాంటమ్, డీప్ టెక్నాలజీ వస్తున్నాయి. కర్నూలులో అన్ని రకాల డ్రోన్లు తయారు చేస్తున్నారు. రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రగా మార్చేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నాం. భవిష్యత్తు అంతా ఇన్నోవేషన్స్ రంగానిదే. ప్రతి ఆవిష్కరణకు అమరావతే వేదిక కావాలి. సాంకేతికతను అందిపుచ్చుకునే బాధ్యత యువతరానిదే" అని సీఎం చంద్రబాబు అన్నారు. కార్యక్రమంలో మంత్రి నారాయణ, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ఉత్తరాంధ్రకు తీవ్ర వాయుగుండం ముప్పు.. సీఎం చంద్రబాబు సమీక్ష

బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం రాష్ట్రం వైపు దూసుకొస్తున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఇప్పటికే పలు ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులతో చర్చించారు. ఈ తీవ్ర వాయుగుండం శ్రీకాకుళం జిల్లాలోని శ్రీకాకుళం-కవిటి మధ్య తీరం దాటే అవకాశం ఉందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు.ఇది తీరం దాటే సమయంలో గంటకు 85 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీయవచ్చని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. దీని ప్రభావంతో శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, పోలవరం, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. అలాగే పశ్చిమ గోదావరి, తూర్పు గోదావరి, కోనసీమ, కాకినాడ, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు పడొచ్చని అంచనా వేశారు. వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ఎటువంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని, జిల్లా కలెక్టర్లు, అధికారులు పూర్తి అప్రమత్తంగా వ్యవహరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

## సీఈసీకి తెలిసే రిగ్గింగ్ జరిగితే...!

కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా కేంద్ర ఎన్నికల కమిషన్‌తో పాటు ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌పై సంచలన ఆరోపణలు చేశారు. ఎన్నికల్లో అవకతవకలు జరుగుతున్నాయని తెలిసి కూడా సీఈసీ వాటిని అనుమతించి ఉంటే, అటువంటి చర్య దేశద్రోహం కిందకే వస్తుందని ఆమె తీవ్ర వ్యాఖ్యలు చేశారు. బుధవారం తన వయనాడ్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని నీలంబూరులో విలేకరులతో మాట్లాడిన సందర్భంగా ప్రియాంక ఈ వ్యాఖ్యలు చేశారు.ఎన్నికల కమిషన్ (ఈసీ) పనితీరులో అక్రమాలు చోటుచేసుకున్నాయని, కమిషనర్ల మధ్య విభేదాలు ఉన్నాయని వెలువడిన మీడియా కథనాలపై ఆమె స్పందించారు. ఈ పరిణామాలు ప్రజాస్వామ్యానికి "అత్యంత ప్రమాదకరం" అని ఆమె అభివర్ణించారు. ఈ వ్యవహారంపై నిష్పక్షపాత విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు.ఓటర్ల జాబితా సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) సందర్భంగా పేర్ల తొలగింపు సహా పలు ఇతర అంశాలపై ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి అసమ్మతి వ్యక్తం చేశారన్న కథనాలను ఈ సందర్భంగా ఆమె ప్రస్తావించారు. మహారాష్ట్ర, హర్యానా రాష్ట్రాల్లో లక్షలాది మంది ఓటర్ల పేర్లను జాబితా నుంచి అక్రమంగా తొలగించారని గత కొంతకాలంగా వస్తున్న ఆరోపణలను ఆమె గుర్తుచేశారు. ఎన్నికలు నిష్పక్షపాతంగా జరగకపోతే లేదా ఈసీయే అక్రమాలకు సహకరిస్తే, అది ప్రజాస్వామ్యంపై జరిగిన గొడ్డలిపెట్టుగా పరిగణించాల్సి ఉంటుందని అన్నారు. అయితే, ఓటర్ల జాబితా సవరణకు సంబంధించిన నిర్ణయాలన్నీ ఏకగ్రీవంగానే తీసుకున్నామని ఎన్నికల కమిషన్ ఇదివరకే స్పష్టం చేయడం గమనార్హం.

# అంబానీని వెనక్కి నెట్టిన అదానీ.. తగ్గిన ముఖేశ్ అంబానీ సంపద!

- మొదటి పేజీ తరువాయి

అంబానీని వెనక్కి నెట్టారు. ఈ జాబితాలో ఆర్సెలర్‌మిట్టల్ యజమాని ఎల్.ఎన్. మిట్టల్ కుటుంబం 93 శాతం వృద్ధితో, రూ. 3.39 లక్షల కోట్ల సంపదతో మూడో స్థానంలో నిలిచింది.ఈ ఏడాది జాబితాలో మహిళా సంపన్నుల సంఖ్య గణనీయంగా పెరగడం గమనార్హం. కొత్తగా 131 మంది మహిళలు ఈ జాబితాలో చోటు దక్కించుకున్నారు. మహిళల విభాగంలో రూ. 2.79 లక్షల కోట్ల సంపదతో రోష్నీ నాడార్ మల్హోత్రా అగ్రస్థానంలో నిలిచారు. దేశంలో డాలర్ బిలియనీర్ల సంఖ్య కూడా రికార్డు స్థాయిలో 391కి చేరింది. అత్యధిక సంపన్నులు ఉన్న నగరంగా ముంబై ప్రథమ స్థానంలో నిలవగా, బెంగళూరు, ఢిల్లీ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.సాంకేతిక రంగం నుంచి కొత్త సంపన్నుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగానికి చెందిన 19 మంది ఈ జాబితాలో స్థానం సంపాదించగా, వారిలో 15 మంది కొత్తవారు కావడం విశేషం. క్వాంటం కంప్యూటింగ్ విభాగం నుంచి తొలిసారిగా బెంగళూరుకు చెందిన నాగేంద్ర నాగరాజ రూ. 1,700 కోట్ల సంపదతో ఈ జాబితాలో చేరారు.

## చంద్రబాబు 99 పైసలకే తనకు కావాల్సిన వారికి అత్యంత విలువైన భూములు కేటాయిస్తున్నారు

- మొదటి పేజీ తరువాయి

ఈ ప్రభుత్వంలో అవినీతి ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చని, అడ్డగోలుగా భూములను పంచుకుంటున్నారని మండిపడ్డారు.ప్రతి గ్రామంలో గంజాయితో పాటు విచ్చలవిడిగా మద్యం దొరుకుతోందని, గుళ్లు, బడుల పక్కన కూడా బెల్టు షాపులు వెలిశాయని మండిపడ్డారు. విశాఖ మేయర్, కార్పొరేషన్‌ను ప్రభుత్వం హైజాక్ చేసిన తీరును ప్రజలకు వివరించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పార్టీ ప్రతి కార్యకర్తకు అన్ని వేళలా అండగా ఉంటుందని, విశాఖలోని తాగునీటి సమస్యలు, భూముల అక్రమాలపై ప్రజల్లో పోరాడాలని సూచించారు. చంద్రబాబుకు ప్రజాస్వామ్యం అంటే లెక్కలేదని, 2019 నంద్యాల ఉపఎన్నిక నుంచి పోలీసులను అడ్డుపెట్టుకుని అరాచకాలు చేస్తున్నారని ఆరోపించారు. తాత్కాలిక అధికారంతో విర్రవీగినా... శాశ్వతంగా నిలిచేది ప్రజాస్వామ్యమేనని, ప్రజల తీర్పు నుంచి ఎవరూ తప్పించుకోలేరని పేర్కొన్నారు.



## భారీ వర్షాలకు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

**గుంటూరు, పెన్ పవర్,సెప్టెంబర్ 23 :**
అల్పపీడనం కారణంగా భారీ వర్షాలు అవకాశం ఉన్న దృష్ట్యా జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. భారీ వర్షాలు, ఆకస్మిక వరదలు సమాచారాన్ని తెలుసుకోవచ్చని, ప్రజలు కూడా సమాచారం అందించవచ్చని తెలిపారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో 08632234014 కంట్రోల్ రూమ్ ఏర్పాటుతో పాటు అన్ని మండల కేంద్రాల్లో కంట్రోల్ రూమ్ లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

పెన్ పవర్
సెంట్రల్ ఆంధ్ర
ఎన్.టి.ఆర్ జిల్లా । కృష్ణా । గుంటూరు । పల్నాడు । బాపట్ల

## రిజర్వేషన్ల కోసం ఓటర్ల గుర్తింపు ప్రక్రియ ప్రారంభం కమిషనర్ కె.మయూర్ అశోక్

**గుంటూరు, పెన్ పవర్,సెప్టెంబర్ 23:**



గుంటూరు నగర పాలక సంస్థ పరిధిలోని 76 డివిజన్లలో వార్డుల వారీగా రిజర్వేషన్ల ఖరారు కోసం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళా ఓటర్ల గుర్తింపు ప్రక్రియ ప్రారంభమైంది. ఈ ప్రక్రియను సెప్టెంబర్ 23 నుంచి అక్టోబర్ 1 వరకు పారదర్శకంగా నిర్వహించనున్నట్లు నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ తెలిపారు.
సెప్టెంబర్ 23 నుంచి 25 వరకు సర్వే సిబ్బంది వార్డులు, పోలింగ్ కేంద్రాల వారీగా ఇంటింటికీ వెళ్లి ఓటర్ల జాబితాల ఆధారంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళా ఓటర్లను గుర్తిస్తారు. సెప్టెంబర్ 26న ముసాయిదా జాబితాలను నగర పాలక సంస్థ, రెవెన్యూ డివిజన్ అధికారి, తహసీల్దార్ కార్యాలయాల్లో ప్రజల పరిశీలనకు అందుబాటులో ఉంచుతారు. సెప్టెంబర్ 27, 28 తేదీల్లో ప్రజల నుంచి అభ్యంతరాలు, దావాలను స్వీకరిస్తారు. సెప్టెంబర్ 29, 30 తేదీల్లో అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి దరఖాస్తులను పరిశీలిస్తారు. అనంతరం అక్టోబర్ 1న సవరించిన తుది జాబితాను అధికారికంగా ప్రకటిస్తారు.



నగర ప్రజలు తమ ఓటరు వివరాలను పరిశీలించుకుని, గుర్తింపు ప్రక్రియకు పూర్తిస్థాయిలో సహకరించాలని కమిషనర్ కోరారు.
ఎన్నికల నిర్వహణలో భాగంగా పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులను పరిశీలించి, అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఎన్నికల సిబ్బందికి శిక్షణ, బ్యాలెట్ పెట్టెల భద్రత, ఎన్నికల సామగ్రి సమకూర్చడం వంటి ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.
సమీక్షా సమావేశంలో అదనపు కమిషనర్ ఐ.కిషోర్, ఉప కమిషనర్లు జి.సాంబశివరావు, బి.శ్రీనివాసరావు, సిహెచ్.శ్రీనివాస్, నగర ప్రణాళికాధికారి డి.రాంబాబు, పర్యవేక్షణ ఇంజనీర్ జి.వెంకటేశ్వరరావు తదితర అధికారులు పాల్గొన్నారు.

## బాల్య వివాహాలు, ఈవ్‌టీజింగ్‌పై విద్యార్థులకు అవగాహన సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి: శక్తి బృందం

**మహిళలు, బాలికల భద్రతకు హెల్ప్‌లైన్ నంబర్ల వినియోగంపై అవగాహన**





**చీరాల, సెప్టెంబర్ 23, (పెన్ పవర్) :**
బాపట్ల జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్, ఐపీఎస్ ఆదేశాల మేరకు, చీరాల డీఎస్పీ మోయిన్ సూచనలతో, చీరాల 2 టౌన్ సీఐ శశికుమార్ పర్యవేక్షణలో బుధవారం విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చీరాల 2 టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కొత్తపేట యానాది కాలనీ జిల్లా పరిషత్ పాఠశాలలో చీరాల సబ్ డివిజన్ శక్తి బృందం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.
ఈ సందర్భంగా శక్తి బృందం కానిస్టేబుల్ కె. సుబ్బారావు విద్యార్థినీ, విద్యార్థులకు బాల్య వివాహాలు, ఈవ్‌టీజింగ్, రోడ్డు భద్రతా నిబంధనలు, శక్తి యాప్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించడంతో పాటు వాటిని అరికట్టడంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, సమాజం కీలక పాత్ర పోషించాలని సూచించారు. బాల్యవివాహాలు జరుగుతున్నట్లు సమాచారం తెలిసిన వెంటనే సంబంధిత అధికారులు లేదా పోలీసులకు తెలియజేయాలని కోరారు.
ఈవ్‌టీజింగ్‌కు పాల్పడటం చట్టరీత్యా నేరమని, ఎవరైనా విద్యార్థినులను వేధించినా లేదా అనుచితంగా ప్రవర్తించినా భయపడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. మహిళలు, బాలికల భద్రత కోసం పోలీస్ శాఖ అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.
అత్యవసర పరిస్థితుల్లో మహిళలు, బాలికలు తక్షణ పోలీస్ సహాయం పొందేందుకు శక్తి యాప్ ఉపయోగ పడుతుందని వివరించారు. అలాగే పెరుగుతున్న సైబర్ నేరాల నేపథ్యంలో ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సోషల్ మీడియా వేదికల్లో వచ్చే తప్పుడు వార్తలు, అపరిచితుల నుంచి వచ్చే సందేశాలు, అనుమానాస్పద లింకుల పట్ల అప్రమత్తంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు.
అదేవిధంగా పోక్సో చట్టం, మహిళలు మరియు బాలికల రక్షణకు సంబంధించిన అంశాలతో పాటు స్వీయ రక్షణ (సెల్ఫ్ డిఫెన్స్) చర్యలపై అవగాహన కల్పించారు. ఏదైనా సమస్య ఎదురైనప్పుడు 100, 112, 181, 1972, 1091, 1098 హెల్ప్‌లైన్ నంబర్లకు సమాచారం అందించాలని, పోలీస్ శాఖ తక్షణమే స్పందించి చట్టపరమైన చర్యలు తీసుకుంటుందని తెలిపారు.
ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి. శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

## కంట్రోల్ రూమ్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



**విజయవాడ, పెన్ పవర్,సెప్టెంబర్ 23:**
భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు ఎలాంటిఇబ్బందులుతలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌ను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్.. వర్షపాతం, ప్రజల నుంచి అందిన ఫిర్యాదులు, వాటిపై తీసుకున్న చర్యలను పరిశీలించారు.
ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించి సంబంధిత శాఖలకు సమాచారం అందించి, సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. జిల్లాలో నమోదయ్యే వర్షపాత వివరాలను ప్రతి రెండు గంటలకు నమోదు చేసి సంబంధిత అధికారులు, మీడియాకు అందుబాటులో ఉంచాలని సూచించారు.
లోతట్టు ప్రాంతాలు, వర్షపు నీరు నిలిచే ప్రాంతాలు, రహదారుల పరిస్థితిపై ప్రత్యేక దృష్టి సారించి నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు తక్షణ సహాయం అందేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. కంట్రోల్ రూమ్ సిబ్బంది 24 గంటలూ అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు.
అత్యవసర సమాచారం కోసం కంట్రోల్ రూమ్: 9154970454

## స్థానిక సంస్థల ఎన్నికలకు సమాయత్తం కావాలి.. వైసీపీ ఆటలు సాగవు: ఎమ్మెల్యే గళ్ళా మాధవి





**గుంటూరు, పెన్ పవర్, సెప్టెంబర్, 23,**
స్థానిక సంస్థల ఎన్నికలకు సమాయత్తం కావాలని, అరాచకం సృష్టించి లబ్ధిపొందాలని చూస్తున్న వైసీపీ ఆటలు సాగవమని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. బుధవారం తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ క్యాలెండర్ సమావేశంలో భాగంగా డివిజన్ పార్టీ అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. అనంతరం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన పార్టీ నేతల గ్రీవెన్స్ కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీమతి గళ్ళా మాధవి పార్టీ నాయకులు, కార్యకర్తల నుంచి అర్జీలు స్వీకరించారు. అందిన వినతులను పరిశీలించి, వాటి పరిష్కారానికి సంబంధిత నాయకులు, అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలు అతి త్వరలో జరగనున్న నేపథ్యంలో బూత్ స్థాయి నుంచి ప్రతి నాయకుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎన్నికల్లో అలజడులు సృష్టించి రాజకీయ లబ్ధి పొందాలని వైసీపీ ప్రయత్నిస్తున్నప్పటికీ వారి ఆటలు సాగవని అన్నారు. కూటమి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు పార్టీ శ్రేణులు ఎన్నికలకు పూర్తిస్థాయిలో సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. అదే విధంగా విజయవాడలో ఉపాధ్యాయులపై వైసీపీ ప్రభుత్వం చేపట్టిన దమనకాండను ఖండిస్తూ సమావేశంలో ఏకగ్రీవ తీర్మానం చేశారు. ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణి అనంతరం ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్‌ఎఫ్) చెక్కులను ఎమ్మెల్యే గళ్ళా మాధవి 83 మంది లబ్ధిదారులకు పంపిణీ చేశారు. మొత్తం రూ.1,34,78,692 విలువైన చెక్కులను అందజేసి వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించారు. ఇప్పటి వరకు గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో 767 మంది లబ్ధిదారులకు రూ.10,60,30,615 విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేసినట్లు ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు.
అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేస్తున్నామని, ఆపదలో ఉన్న కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, డివిజన్ అధ్యక్షులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు

## ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ నిర్మాణానికి భూమిపూజ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు



**గుంటూరు, పెన్ పవర్, సెప్టెంబర్, 23,:**
అమరావతిలో ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ నిర్మాణం జరగడం గర్వకారణమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. సంస్థ నిర్మాణానికి భూమిపూజ అనంతరం జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే దేశవ్యాప్తంగా కోట్లాది మందికి కంటి వైద్య సేవలు అందించిన ఎల్వీ ప్రసాద్ సంస్థ అమరావతి నుంచి మరింత విస్తృతంగా సేవలు అందించనుందని తెలిపారు.12 ఎకరాల విస్తీర్ణంలో ఏటా సుమారు 3 లక్షల మందికి వైద్య సేవలు అందించేలా ఇన్‌స్టిట్యూట్‌ను నిర్మిస్తున్నట్లు చెప్పారు. కంటి చికిత్సలతో పాటు పరిశోధన, శిక్షణ కార్యక్రమాలు కూడా నిర్వహించేలా ప్రపంచస్థాయి కేంద్రంగా తీర్చిదిద్దాలని ఆకాంక్షించారు. అమరావతిలో ప్రత్యేక ఐ అండ్ బ్రెయిన్ సెంటర్ ఏర్పాటుచేయడంఅభినందనీయమన్నారు. అమరావతిని ప్రజా రాజధానిగా, ప్రపంచస్థాయి నగరంగా అభివృద్ధి చేస్తున్నామని సీఎం తెలిపారు. బ్లూ, గ్రీన్ సిటీ, గ్రీన్ ఎనర్జీ, కార్బన్ న్యూట్రల్, డీప్‌టెక్ క్యాపిటల్ వంటి అంశాలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. క్వాంటం కంప్యూటింగ్, స్పేస్, డ్రోన్, ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్ రంగాల్లో భారీ పెట్టుబడులు, సంస్థలు వస్తున్నాయని పేర్కొన్నారు.అమరావతిలో సుమారు రూ.50 వేల కోట్ల విలువైన అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, ఇన్నర్, ఔటర్ రింగ్ రోడ్లు, స్పోర్ట్స్ సిటీ, అంతర్జాతీయ విమానాశ్రయం వంటి కీలక ప్రాజెక్టులు రానున్నాయని తెలిపారు. విద్య, వైద్యం, పరిశోధన, నాలెడ్జ్ ఎకానమీకి అమరావతిని ప్రధాన కేంద్రంగా తీర్చిదిద్దుతామని అన్నారు.



రాజధాని నిర్మాణం కోసం భూములు ఇచ్చిన రైతుల త్యాగాలను సీఎం మరోసారి అభినందించారు. ల్యాండ్ పూలింగ్ ప్రక్రియ, రైతుల సహకారం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని పేర్కొన్నారు. బసవతారకం క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్, ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ తదితర ప్రముఖ సంస్థలతో అమరావతిలో హెల్త్‌కేర్ ఎకోసిస్టమ్ అభివృద్ధి చెందుతోందన్నారు. బ్యాంకింగ్ స్ట్రీట్‌తో అమరావతి ఆర్థిక కార్యకలాపాలకు కూడా ప్రధాన కేంద్రంగా మారనుందని సీఎం చంద్రబాబు తెలిపారు.

## పాఠశాల బస్సు డ్రైవర్లు బాధ్యతతో విధులు నిర్వహించాలి జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ



**విజయవాడ, పెన్ పవర్,సెప్టెంబర్ 23:**
పాఠశాల విద్యార్థుల సురక్షిత ప్రయాణం బస్సు డ్రైవర్లపై ఉన్న అత్యంత కీలకమైన బాధ్యత అని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. డ్రైవర్లు నిబద్ధతతో, అప్రమత్తంగా విధులు నిర్వహించాలని సూచించారు.
విజయవాడ బెంజ్ సర్కిల్‌లోని లారీ ఓనర్స్ అసోసియేషన్ హాల్‌లో జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో పాఠశాల బస్సు డ్రైవర్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైవర్లు తప్పనిసరిగా యూనిఫామ్ ధరించాలని, విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.
డ్రైవింగ్ నైపుణ్యంతో పాటు సహనం, సమయపాలన, మంచి ప్రవర్తన, వాహన నిర్వహణపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. రహదారి భద్రతా నిబంధనలు పాటిస్తూ అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. పాఠశాల యాజమాన్యాలు డ్రైవర్లకు ఎప్పటికప్పుడు శిక్షణ, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు.
విద్యార్థుల సురక్షిత రవాణా కోసం పాఠశాల యాజమాన్యాలు, డ్రైవర్లు, రవాణా శాఖ, అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు.కార్యక్రమంలో జిల్లా రవాణా శాఖ అధికారి ఎం.పురేంద్ర, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్, రవాణా శాఖ అధికారులు, సిబ్బంది, పాఠశాల బస్సు, టాక్సీ డ్రైవర్లు పాల్గొన్నారు.



## అనుమతులు లేని లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేస్తే నష్టపోయే ప్రమాదం

**అనధికార లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేయవద్దు -- మున్సిపల్ కమిషనర్ రమ్య కీర్తన**



**నరసరావుపేట, పెన్ పవర్ సెప్టెంబర్ 23:**
నరసరావుపేట పట్టణ పరిధిలో ప్రభుత్వ అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన పలు అనధికార లేఅవుట్లను మున్సిపల్ అధికారులు గుర్తించినట్లు బుధవారం ఒక ప్రగటనలో తెలిపారు. ప్రజలు ప్లాట్లు కొనుగోలు చేసే ముందు సంబంధిత అనుమతులు ఉన్నాయో లేదో తప్పనిసరిగా పరిశీలించాలని సూచించారు. మున్సిపల్ అధికారుల వివరాల ప్రకారం సర్వే నంబర్లు 62, 493, 496, 103 పరిధిలో ఏర్పాటు చేసిన కొన్ని లేఅవుట్లకు సంబంధిత అధికారుల నుంచి ఎటువంటి అనుమతులు లేవని గుర్తించినట్లు మున్సిపల్ కమిషనర్ వెల్లడించారు. ఈ నేపథ్యంలో ఆయా లేఅవుట్లలో ప్లాట్ల రిజిస్ట్రేషన్లు చేపట్టవద్దని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి సమాచారం అందించినట్లు తెలిపారు. అదేవిధంగా అనుమతులు లేని లేఅవుట్లలో విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేయకుండా సంబంధిత విద్యుత్ శాఖ అధికారులకు కూడా సమాచారం ఇచ్చినట్లు పేర్కొన్నారు. అనధికార లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేయడం వల్ల భవిష్యత్తులో పలు సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉందని హెచ్చరించారు.ఎకావున ప్రజలు ప్లాట్లు కొనుగోలు చేసే ముందు సంబంధిత అనుమతులు, లేఅవుట్ ఆమోద పత్రాలు మరియు ఇతర చట్టబద్ధ పత్రాలను పరిశీలించిన తర్వాత మాత్రమే కొనుగోలు చేయాలని మున్సిపల్ అధికారులు సూచించారు.

## 28, 29వ వార్డుల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

### రూ.17.05 లక్షల 15వ ఆర్థిక సంఘ నిధులతో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువల నిర్మాణం

**చీరాల, సెప్టెంబర్ 23, (పెన్ పవర్) :**
చీరాల మున్సిపాలిటీ పరిధిలోని 28, 29వ వార్డుల్లో 15వ ఆర్థిక సంఘ నిధులతో రూ.17.05 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువల నిర్మాణ పనులకు చీరాల శాసనసభ్యులు మద్దులూరి మాలకొండయ్య శంకుస్థాపన చేశారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాలకొండయ్య మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. చీరాల పట్టణంలోని ప్రతి వార్డులో రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు తదితర మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు.
సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువల నిర్మాణంతో ప్రజల రాకపోకలు సులభతరం కావడంతో పాటు పారిశుధ్య పరిస్థితులు మెరుగుపడతాయని అన్నారు. ప్రజలు అందిస్తున్న ఆశీర్వాదంతో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి చీరాల పట్టణాన్ని



ఆదర్శవంతమైన పట్టణంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని తెలిపారు.
ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, మహిళలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వర్షాన్ని సైతం లెక్కచేయకుండా అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే కొండయ్య దృష్టి

### ప్రజలతో మమేకమై సమస్యల పరిష్కారానికి చర్యలు



**అధికారులు, నాయకులు, కాంట్రాక్టర్లతో సమన్వయంతో అభివృద్ధి పనులు**

**చీరాల, సెప్టెంబర్ 23, (పెన్ పవర్) :**
చీరాల నియోజకవర్గ అభివృద్ధిపై ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య ప్రత్యేక దృష్టి సారించారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా ప్రజలతో మమేకమవుతూ పట్టణంలో చేపట్టాల్సిన వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై క్షేత్రస్థాయిలో పరిశీలన చేస్తున్నారు.
చీరాలను సుందర నగరంగా తీర్చిదిద్దే లక్ష్యంతో అభివృద్ధి పనులను ప్రణాళికాబద్ధంగా ముందుకు తీసుకెళ్తున్నారు. ప్రజల అవసరాలను తెలుసుకుంటూ, ఆయా ప్రాంతాల్లో చేపట్టాల్సిన మౌలిక వసతుల పనులపై సంబంధిత అధికారులకు సూచనలు చేస్తున్నారు. పనుల నాణ్యత, వేగం విషయంలో కాంట్రాక్టర్లు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తూ, పనులు ప్రజలకు ఉపయోగపడే విధంగా పూర్తి చేయాలని ఆదేశిస్తున్నారు.
అభివృద్ధి కార్యక్రమాల అమలులో స్థానిక నాయకులు, అధికారులు, కాంట్రాక్టర్ల మధ్య సమన్వయం ఉండేలా ఎమ్మెల్యే కొండయ్య చర్యలు తీసుకుంటున్నారని స్థానికులు పేర్కొన్నారు. ప్రజా సమస్యలకు ప్రాధాన్యతనిస్తూ చీరాల అభివృద్ధికి కృషి చేస్తున్న ఎమ్మెల్యేకు ప్రజలు అభినందనలు తెలిపారు.

## వినాయక చవితి ఉత్సవాల్లో ఎమ్మెల్యే మాలకొండయ్య

### 28వ వార్డులో ఘనంగా 26వ వార్షికోత్సవ వేడుకలు





**చీరల, సెప్టెంబర్ 23, (పెన్ పవర్) :**
చీరాల పట్టణంలోని 28వ వార్డులో తూర్పు రెడ్డిక యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 26వ వార్షికోత్సవ వినాయక చవితి ఉత్సవాల్లో చీరాల శాసనసభ్యులు మద్దులూరి మాలకొండయ్య పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వినాయక పందిరిలో ఏర్పాటు చేసిన వినాయక స్వామి ప్రతిమను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.
అనంతరం ఎమ్మెల్యే మాలకొండయ్య సీతారాముల వారి ఆలయాన్ని సందర్శించారు. ఆలయ అభివృద్ధి కార్యక్రమాల కోసం రూ.2 లక్షలను కమిటీ సభ్యులకు అందజేశారు. అనంతరం నిర్వహించిన అన్నసమారాధన కార్యక్రమంలో పాల్గొన్నారు.
ఈ సందర్భంగా ఉత్సవ నిర్వాహకులు ఎమ్మెల్యే మాలకొండయ్యను ఘనంగా సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ హిందువులకు అత్యంత పవిత్రమైన పండుగల్లో వినాయక చవితి ఒకటని అన్నారు. భక్తిశ్రద్ధలతో వినాయకుడిని ప్రార్థిస్తే ఆయన కటాక్షంతో ప్రజల సమస్యలు తొలగి, సుఖసంతోషాలు కలుగుతాయని పేర్కొన్నారు.
కార్యక్రమంలో స్థానిక నాయకులు, ఉత్సవ నిర్వాహకులు, కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## విజయవాడ ఆయుర్వేద కళాశాలలో ఘనంగా జాతీయ ఆయుర్వేద దినోత్సవ వేడుకలు






**విజయవాడ,పెన్ పవర్,సెప్టెంబర్ 23:**
విజయవాడ డా. ఎన్.ఆర్.ఎస్. ప్రభుత్వ ఆయుర్వేద కళాశాలలో 11వ జాతీయ ఆయుర్వేద దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రజల ఆరోగ్యం, శ్రేయస్సు కోసం శ్రీ ధన్వంతరి హోమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.కార్యక్రమానికి ఆయుష్ శాఖ డైరెక్టర్ గోపాలకృష్ణ రౌణంకి, అదనపు డైరెక్టర్ డా. పి. సాయి సుధాకర్, డిప్యూటీ డైరెక్టర్ జె. ధనుంజయరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సిసిఆర్ఎసి--స్పార్క్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైన యూజీ, పీజీ విద్యార్థులకు చెక్కులు అందజేశారు. అలాగే వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అవార్డులు, బహుమతులు అందించారు.
కళాశాల ప్రిన్సిపాల్ డా. టి. బుల్లయ్య, డా. ఏ.ఎల్. ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డా. పి. జగదీష్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. అధ్యాపకులు, పీజీ స్కాలర్లు, ఇంటర్న్‌లు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## వినాయక మండపాల్లో ఎమ్మెల్యే గళ్ళా మాధవి ప్రత్యేక పూజలు





**గుంటూరు, పెన్ పవర్, సెప్టెంబర్, 23,**
గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా పలు వినాయక మండపాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు నిర్వహించిన అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొని నిర్వాహకులను అభినందించారు.
ముందుగా గుంటూరు శ్రీనివాసరావుపేట 1వ లైన్ మరియు ఆర్ అగ్రహారం 4వ లైన్ ప్రాంతాల్లో వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాలకు హాజరైన ఎమ్మెల్యే గళ్ళా మాధవి, భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. అనంతరం సంపత్ నగర్‌లో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని నిర్వాహక కమిటీ సభ్యులను అభినందించారు.అదేవిధంగా గుజ్జనగుండ్ల సెంటర్‌లో ఏపీటీఎస్ చైర్మన్ మన్నవ మోహన్ కృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపాన్ని సందర్శించిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి, వినాయక స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అక్కడ నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు.

## చేనేతపురి కాలనీలో అగ్ని ప్రమాదం

### షార్ట్ సర్క్యూట్ కారణంగా ఇంట్లో మంటలు.. సకాలంలో స్పందించిన స్థానికులు

**వేటపాలెం, సెప్టెంబర్ 23, (పెన్ పవర్) :**
వేటపాలెం మండలం చల్లారెడ్డిపాలెం పంచాయతీ పరిధిలోని కొణిజేటి చేనేతపురి కాలనీలో బుధవారం ఉదయం షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం సంభవించింది. కాలనీలోని 229వ నంబర్ ఇంట్లో సప్రం లక్ష్మి నివాసంలో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి.
ఈ ప్రమాదంలో ఇంట్లో ఉన్న ఫ్రిజ్‌తో పాటు వంట సామగ్రి పూర్తిగా దగ్ధమయ్యాయి. ఇంటి నుంచి మంటలు, పొగలు రావడాన్ని గమనించిన స్థానికులు వెంటనే అప్రమత్తమై అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. అనంతరం స్థానికులు చాకచక్యంగా వ్యవహరించి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. వారి సమయస్ఫూర్తి, ఐకమత్యంతో మంటలు ఇతర ఇళ్లకు వ్యాపించకుండా నివారించగలిగారు.
కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించే కుటుంబం ఇంట్లో ఈ ఘటన జరగడంతో భారీగా ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానికులు సకాలంలో స్పందించడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్





కారణంగానే అగ్ని ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు.
వర్షాకాలంలో ఉరుములు, మెరుపులతో పాటు విద్యుత్ హెచ్చుతగ్గులు సంభవించే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. వాతావరణంలో మార్పులు చోటుచేసుకున్నప్పుడు ఫ్రిజ్‌లు, ఏసీలు, టీవీలు, ఇతర విద్యుత్ పరికరాలను ఆపివేయడంతో పాటు, అవసరమైతే విద్యుత్ సరఫరాను నిలిపివేయాలని పేర్కొన్నారు. విద్యుత్ హెచ్చుతగ్గుల కారణంగా పరికరాలు దెబ్బతినడంతో పాటు అగ్ని ప్రమాదాలు సంభవించే అవకాశం ఉన్నందున తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు.
విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగినప్పుడు వాటిపై నీరు పోయకూడదని నిపుణులు సూచిస్తున్నారు. నీటితో మంటలను ఆర్పేందుకు ప్రయత్నిస్తే విద్యుత్ షాక్ తగిలే ప్రమాదం ఉంది. ముందుగా విద్యుత్ సరఫరాను నిలిపివేసి, ఇసుక లేదా తగిన అగ్నిమాపక పరికరాలను ఉపయోగించి మంటలను అదుపు చేయాలి. ప్రమాద సమయంలో తొందరపాటు నిర్ణయాలు తీసుకోకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచిస్తున్నారు.

## రాజ్యాంగం, ప్రోటోకాల్‌కు విరుద్ధంగా శిలాఫలకాలు ఏర్పాటు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి

### ఆర్డీఓకు వినతిపత్రం అందజేసిన వైఎస్సార్‌సీపీ చీరాల పట్టణ అధ్యక్షులు యాతం మేరి బాబు




**సెప్టెంబర్ 23, (పెన్ పవర్) :**
చీరాల నియోజకవర్గ పరిధిలో, ముఖ్యంగా చీరాల పురపాలక సంఘంలో నిబంధనలకు విరుద్ధంగా శిలాఫలకాలు ఏర్పాటు చేస్తున్న అధికారులు, అధికార పార్టీ నాయకులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ చీరాల పట్టణ అధ్యక్షులు యాతం మేరి బాబు ఆధ్వర్యంలో బుధవారం ఆర్డీఓకు వినతిపత్రం అందజేశారు.
ఈ సందర్భంగా యాతం మేరి బాబు మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనలు, ప్రోటోకాల్‌ను పాటించకుండా మాజీ ప్రజాప్రతినిధులు, ప్రభుత్వంలో ప్రస్తుతం ఎలాంటి పదవులు లేని వ్యక్తుల పేర్లతో శిలాఫలకాలు ఏర్పాటు చేయడం సరికాదని అన్నారు. మున్సిపల్ చట్టం, సంబంధిత మార్గదర్శకాలను పాటిస్తూ శిలాఫలకాల ఏర్పాటులో పారదర్శకత ఉండాలని కోరారు.అధికారులు నిబంధనలను ఉల్లంఘించి రాజకీయ ప్రయోజనాలకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలను ఆయన చేశారు. చట్టపరమైన నిబంధనలకు విరుద్ధంగా ఇప్పటికే ఏర్పాటు చేసిన శిలాఫలకాలను పరిశీలించి, నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే వాటిని తొలగించాలని ఆర్డీఓను కోరినట్లు తెలిపారు.
అలాగే మాజీ కౌన్సిలర్లు, మాజీ చైర్మన్ల పేర్లతో పాటు ఇతర హోదాలను ప్రస్తావిస్తూ శిలాఫలకాల ఏర్పాటు విషయంలో నిబంధనలు పాటించాల్సిన అవసరం ఉందన్నారు.రాజ్యాంగం,చట్టం, ప్రభుత్వ ప్రోటోకాల్‌కు అనుగుణంగా అధికారులు వ్యవహరించాలని కోరారు. నిబంధనల ఉల్లంఘనకు పాల్పడినట్లు తేలిన అధికారులు, నాయకులపై తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.
ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ గుంటూరు ప్రభాకర్‌రావు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు చెల్లి బాబురావు, కంచర్ల చక్రవర్తి, సోషల్ మీడియా కార్యదర్శి సల్లూరి నవీన్, సీనియర్ నాయకులు తొట్టెంపూడి ఇన్నయ్య, బొల్లాపల్లి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## గణపవరంలో భక్తిశ్రద్ధలతో అయ్యప్ప స్వాముల మహా అన్నదానం

### అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన జనసేన యువ నాయకులు చరణ్ తేజ

**సెప్టెంబర్ 23, (పెన్ పవర్) :**
నాదెండ్ల మండలం గణపవరం గ్రామంలోని శ్రీ అయ్యప్ప స్వామి దేవస్థానంలో శబరిమలై చిత్ర పూజ 41 రోజుల దీక్షను పురస్కరించుకుని మహా అన్నదాన కార్యక్రమం అత్యంత వైభవంగా ప్రారంభమైంది. నియోజకవర్గ జనసేన పార్టీ యువ నాయకులు చరణ్ తేజ ఈ పవిత్రమైన అన్నదానాన్ని స్వయంగా వడ్డించి లాంఛనంగా ప్రారంభించారు.
తొలిరోజు సుమారు 250 మంది దీక్షాపరులైన అయ్యప్ప స్వాములకు భక్తిశ్రద్ధలతో అన్నప్రసాద వితరణ గావించారు.
కఠిన నియమ నిష్ఠలతో 41 రోజుల పాటు దీక్షను



ఆచరించే స్వాములకు సేవలందించడం ఎంతో పుణ్యప్రదమని,ఈ కార్యక్రమంలో పాలుపంచుకోవడం సంతోషంగా ఉందని చరణ్ తేజ ఈ సందర్భంగా పేర్కొన్నారు. 'స్వామియే శరణం అయ్యప్ప' శరణుఘోషతో ఆలయ ప్రాంగణం మార్మోగగా.. దీక్షా కాలం ముగిసే వరకు ఈ అన్నదాన సేవలు నిరంతరాయంగా కొనసాగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వీరితోపాటు కమిటీ సభ్యులు మండలనేని వెంకటేశ్వర స్వామి, మండలనేని శ్రీనివాసరావు స్వామి ,తులం పూర్ణచంద్రస్వామి , చక్రవరం శివన్నారాయణ స్వామి, మాదేని చంద్రమౌళి స్వామి, సిద్దు హనుమంతరావు స్వామి తదితరులు ఉన్నారు.

## హెచ్‌డీఎస్‌జీఎఫ్ కబడ్డీ, ఖోఖో పోటీల్లో జీహెచ్‌ఎస్ జామియా ఉస్మానియా విద్యార్థుల సత్తా

### మూడు విభాగాల్లో ద్వితీయ స్థానం.. మరో విభాగంలో తృతీయ స్థానం






**సెప్టెంబర్ 23, (పెన్ పవర్) :**
ముషీరాబాద్ ఎస్‌జీఎఫ్ మండలం ఆధ్వర్యంలో అండర్--14, అండర్--17 బాలబాలికల హెచ్‌డీఎస్‌జీఎఫ్ కబడ్డీ, ఖోఖో పోటీలు విజయవంతంగా ముగిశాయి. రామ్‌నగర్‌లోని సెయింట్ పయస్--10 ఉన్నత పాఠశాలలో సెప్టెంబర్ 21 నుంచి 23 వరకు మూడు రోజులపాటు ఈ పోటీలను నిర్వహించారు.
ఈ క్రీడా పోటీల్లో 32 పాఠశాలలకు చెందిన 1,100 మందికిపైగా విద్యార్థులు వివిధ విభాగాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. కబడ్డీ, ఖోఖో పోటీల్లో జీహెచ్‌ఎస్ జామియా ఉస్మానియా విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి పలు స్థానాలను కైవసం చేసుకున్నారు.
అండర్--14 బాలికల ఖోఖో, అండర్--17 బాలికల కబడ్డీ, అండర్--17 బాలుర కబడ్డీ విభాగాల్లో ద్వితీయ స్థానాలను సాధించారు. అండర్--14 బాలుర కబడ్డీ విభాగంలో తృతీయ స్థానాన్ని దక్కించుకున్నారు.
అండర్--17 బాలికల ఖోఖో, అండర్--14 బాలికల కబడ్డీ, అండర్--14 బాలుర ఖోఖో, అండర్--17 బాలుర ఖోఖో విభాగాల్లో నాలుగో స్థానంలో నిలిచారు. పోటీల ఆద్యంతం విద్యార్థులు జట్టు సమన్వయం, క్రమశిక్షణ, పట్టుదలతోపాటు అత్యుత్తమ క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించారు.
విద్యార్థుల అంకితభావం, ప్రతిభను పాఠశాల యాజమాన్యం అభినందించింది. కోచ్, ఫిజికల్ డైరెక్టర్ ఎం. శ్రీలత, కోచ్, ఫిజికల్ డైరెక్టర్ వి. మానవ్ దాస్ మార్గదర్శకత్వం, ప్రోత్సాహంతో విద్యార్థులు ఈ విజయాలు సాధించారు.




యువ క్రీడాకారులు తమ ప్రతిభ, పోటీతత్వం, క్రీడలపై నిబద్ధతను చాటుకునేందుకు ఈ టోర్నమెంట్ విలువైన వేదికగా నిలిచింది. విద్యార్థులు భవిష్యత్తులో మరిన్ని ఉన్నత విజయాలు సాధించాలని ఉపాధ్యాయులు ఆకాంక్షించారు.

## పిల్లల అభివృద్ధికి సమష్టి బాధ్యత అవసరం గుడ్ షెపర్డ్ కాన్వెంట్ సిస్టర్స్ స్వచ్ఛంద సంస్థ

**విజయవాడ : పెన్ పవర్, సెప్టెంబర్, 23,**

పిల్లల హక్కుల పరిరక్షణ, రక్షణ, విద్య, అభివృద్ధికి ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు, తల్లిదండ్రులు సమష్టిగా కృషి చేయాలని గుడ్ షెపర్డ్ కాన్వెంట్ సిస్టర్స్ స్వచ్ఛంద సంస్థ చైల్డ్ ప్రొటెక్షన్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ సిస్టర్ విద్యా అన్నారు. తాడేపల్లి మండలం గుండిమెడ గ్రామంలో బుధవారం ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలు, ఆరోగ్య సిబ్బందితో సంయుక్త చర్చా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిస్టర్ విద్యా మాట్లాడుతూ బాలల హక్కులపై అవగాహన కల్పించడంతో పాటు, ఉచిత నిర్బంధ విద్యా హక్కు




చట్టం, పోక్సో చట్టం, బాల కార్మిక నిషేధ చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. అత్తోట పోతురాజు మాట్లాడుతూ బాలల రక్షణకు చట్టాలు ఉన్నప్పటికీ, క్షేత్రస్థాయిలో మానవ వనరులు, పునరావాస సేవల కొరత వంటి సమస్యలు ఉన్నాయని తెలిపారు. బాలలపై హింస, దుర్వినియోగం, దోపిడీని సమష్టి కృషితో అరికట్టాలని అన్నారు.ఏఎన్ఎం కె. నాయోమి మాట్లాడుతూ పిల్లలపై సెల్‌ఫోన్ ప్రభావం పెరుగుతోందని, దీనిపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.కార్యక్రమంలో అంగన్వాడీ, ఆశా వర్కర్లు, తల్లిదండ్రులు, సచివాలయ సిబ్బంది, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు పట్టాభిషేకం.. 30న పట్టాల పంపిణీ

**విజయవాడ, పెన్ పవర్,సెప్టెంబర్ 23:**

పేదల ఆత్మగౌరవానికి భరోసా కల్పిస్తూ దశాబ్దాలుగా పరిష్కారం కోసం ఎదురుచూస్తున్న భూ సమస్యలకు ప్రభుత్వం పరిష్కారం చూపింది. ఈ నెల 30న విజయవాడలో గౌరవ ముఖ్యమంత్రి చేతుల మీదుగా పండగ వాతావరణంలోపట్టాల పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీ కేశినేని శివనాథ్ తెలిపారు.

తొలిదశలోఎన్‌టీఆర్ జిల్లా పరిధిలోని వివిధ నియోజకవర్గాలకు చెందిన 24,042 మంది లబ్ధిదారులకు 616.56 ఎకరాల భూమికి అన్ని హక్కులతో పట్టాలు అందించనున్నట్లు పేర్కొన్నారు. ఈ భూముల మార్కెట్ విలువ సుమారు రూ.23,213 కోట్లు ఉంటుందని తెలిపారు.ఎన్‌టీఆర్ పట్టాలు, ఇతర పట్టాలకు సంబంధించి 12,710 మంది, ప్రభుత్వ భూముల్లో నివసిస్తున్న 2,586 మంది, పీవోటీ ఉల్లంఘనలకు సంబంధించిన 8,746 మంది సమస్యలను ప్రభుత్వం పరిష్కరించినట్లు వెల్లడించారు.

విజయవాడ పశ్చిమ, తూర్పు, మధ్య, గన్నవరం, మైలవరం, నందిగామ, జగ్గయ్యపేట, తిరువూరు నియోజకవర్గాల పరిధిలోని లబ్ధిదారులకు పట్టాలు అందనున్నాయని తెలిపారు. ఇంకా ఎవరైనా మిగిలి ఉంటే రెండో దశలో వారి సమస్యలను




కూడా పరిష్కరిస్తామని స్పష్టం చేశారు.

ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌రావు మాట్లాడుతూ.. దశాబ్దాలుగా జఠిలంగా ఉన్న భూ సమస్యలను పరిష్కరించి పేదలకు భరోసా కల్పిస్తున్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ మాట్లాడుతూ ప్రభుత్వ మార్గదర్శకాలు, నిబంధనలకు అనుగుణంగా పట్టాల పంపిణీకి అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారని పేర్కొన్నారు.

కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియా, విజయవాడ ఆర్డీవో వెన్నెల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ చలనచిత్ర అవార్డుల ప్రదానోత్సవంలో బెస్ట్ పాపులర్ ఫిల్మ్, బెస్ట్ ప్రొడక్షన్ డిజైన్ అవార్డులని అందుకున్న 'కల్కి 2898 ఏడీ

**పెన్ పవర్, సెప్టెంబర్, 23,**

72వ జాతీయ చలనచిత్ర అవార్డుల ప్రదానోత్సవం ఘనంగా జరిగింది. ఈ వేడుకలో ఇండియన్ స్క్రీన్స్ పై బిగ్గెస్ట్ హిట్‌గా చరిత్ర సృష్టించిన 'కల్కి 2898 ఏడీ' చిత్రానికి రెండు ప్రతిష్ఠాత్మక జాతీయ అవార్డులు లభించాయి. వైజయంతీ మూవీస్ బ్యానర్‌పై తెరకెక్కిన 'కల్కి 2898 ఏడీ' చిత్రానికి బెస్ట్ పాపులర్ ఫిల్మ్ ప్రొవైడింగ్ హోల్‌సమ్ ఎంటర్‌టైన్‌మెంట్ అవార్డు దక్కింది. అలాగే సినిమాకు అద్భుతమైన ప్రపంచాన్ని సృష్టించడంలో కీలక పాత్ర పోషించిన ప్రొడక్షన్ డిజైనర్ నితిన్ జిహానికి బెస్ట్ ప్రొడక్షన్ డిజైనర్ అవార్డు లభించింది.

చిత్ర దర్శకుడు నాగ్ అశ్విన్, నిర్మాతలు అశ్వినీదత్, స్వప్నదత్ అవార్డుల ప్రదానోత్సవంలో పాల్గొని అవార్డులు అందుకున్నారు.

భారీ కాన్వాస్‌పై, అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో



రూపొందిన 'కల్కి 2898 ఏడీ'కి జాతీయ స్థాయిలో ఈ గుర్తింపు దక్కడం వైజయంతీ మూవీస్‌కు మరో ప్రత్యేకమైన మైలురాయిగా నిలిచింది. దర్శకుడు నాగ్ అశ్విన్ తన యూనిక్ విజన్‌తో క్రియేట్ చేసిన ఫ్యూచరిస్టిక్ ప్రపంచం, అద్భుతమైన ప్రొడక్షన్ డిజైన్, సాంకేతిక నైపుణ్యం, నటీనటుల ప్రతిభకు ఈ అవార్డులు గుర్తింపుగా నిలిచాయి.

దశాబ్దాలుగా భారతీయ సినీ రంగంలో వైజయంతీ మూవీస్ తనదైన ముద్ర వేస్తూ వస్తోంది. ప్రతిష్ఠాత్మక చిత్రాలను నిర్మిస్తూ, కొత్త కథలను అద్భుతంగా ప్రేక్షకుల ముందుకు తీసుకురావడంలో సంస్థ ఎప్పుడూ ముందుంటోంది. ఈ క్రమంలో 'కల్కి 2898 ఏడీ'కి రెండు జాతీయ అవార్డులు రావడం సంస్థ ప్రయాణంలో మరో గర్వకారణమైన అధ్యాయంగా నిలిచింది.

72వ జాతీయ చలనచిత్ర అవార్డుల వేదికపై 'కల్కి 2898 ఏడీ' టీమ్ అవార్డులు అందుకున్న ఈ ప్రత్యేకమైన క్షణాలు సినీ అభిమానులకు కూడా మెమరబుల్ గా నిలిచాయి.

## అవనిగడ్డ వైసీపీ కార్యాలయం నందు ఘనంగా యువనేత సింహాద్రి వికాస్ గారి పుట్టినరోజు వేడుకలు




**అవనిగడ్డ పెన్ పవర్ సెప్టెంబర్ 23**

అవనిగడ్డ మండలం, అవనిగడ్డ వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నందు అవనిగడ్డ నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త మరియు వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర రైతు విభాగం రీజనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీ సింహాద్రి రమేష్ బాబు గారి తనయులు యువనేత సింహాద్రి వికాస్ గారి పుట్టినరోజు సందర్భంగా అవనిగడ్డ నియోజకవర్గ వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆద్వర్యంలో ఏర్పాటు చేసిన కేక్ కటింగ్ కార్యక్రమంలో పాల్గొన్న అవనిగడ్డ నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు శ్రీ సింహాద్రి రమేష్ బాబు గారు వారి తనయులు యువనేత సింహాద్రి వికాస్ గారు, అనంతరం స్వీట్ పంచారు..

ఈ కార్యక్రమంలో వివిధ హోదాలలోని ప్రజా ప్రతినిధులు మరియు వివిధ విభాగాల్లోని పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులు మరియు పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొని సింహాద్రి వికాస్ గారిని శాలువాతో పూలమాలలతో సత్కరించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు...

## వరల్డ్‌స్కిల్స్ షాంఘై--2026 పోటీలు ప్రారంభం
## 63 నైపుణ్య విభాగాల్లో భారత్ తరఫున 70 మంది యువ ప్రతిభావంతుల పోటీ

ప్రపంచ వేదికపై భారత్ నుంచి అతిపెద్ద నైపుణ్య బృందం

**పెన్ పవర్, సెప్టెంబర్, 23,**

వరల్డ్‌స్కిల్స్ షాంఘై--2026 పోటీలు బుధవారం ప్రారంభమయ్యాయి. భారత్ నుంచి ఇప్పటివరకు ఎన్నడూ లేనంతగా 70 మంది యువ ప్రతిభావంతులతో కూడిన అతిపెద్ద బృందం 63 నైపుణ్య విభాగాల్లో పోటీపడుతోంది. నాలుగు రోజులపాటు జరిగే ఈ అంతర్జాతీయ పోటీల ప్రారంభ వేడుక మంగళవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. వివిధ దేశాల బృందాలతో కలిసి నిర్వహించిన 'పరేడ్ ఆఫ్ నేషన్స్'లో టీమ్ ఇండియా పాల్గొంది.

షాంఘై వరల్డ్ ఎక్స్‌పో కల్చరల్ సెంటర్‌లో నిర్వహించిన ప్రారంభ వేడుకకు 65కుపైగా దేశాలు, ప్రాంతాలకు చెందిన సుమారు 1,400 మంది పోటీదారులు హాజరయ్యారు. జాతీయ పతాకాన్ని చేతబూని, టీమ్ ఇండియా రంగులతో కూడిన దుస్తులు ధరించిన భారత బృందం ప్రేక్షకుల హర్షధ్వానాల మధ్య వేదికపై కవాతు చేసింది. దీంతో 48వ వరల్డ్‌స్కిల్స్ పోటీలకు అధికారికంగా శ్రీకారం చుట్టారు.

ఈ పోటీలను అభినందిస్తూ చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ పంపిన సందేశాన్ని ప్రారంభ కార్యక్రమంలో చదివి వినిపించారు. చైనా ప్రధాని లీ చియాంగ్ వేడుకకు హాజరై పోటీలను అధికారికంగా ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు.

భారత ప్రతినిధి బృందం తరఫున వరల్డ్‌స్కిల్స్ ఇండియా అధికారిక ప్రతినిధి, కేంద్ర నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపకత మంత్రిత్వ శాఖ సీనియర్ ఆర్థిక సలహాదారు మనీషా సెన్షర్మ, డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ట్రైనింగ్ డైరెక్టర్ జనరల్, నేషనల్ స్కిల్ ఆర్గనైజేషన్ సీఈఓ దిలీప్ కుమార్ ప్రారంభ వేడుకలో పాల్గొన్నారు. పోటీదారులు, నిపుణులు, మార్గదర్శకులతో కలిసి వారు టీమ్ ఇండియాకు మద్దతుగా నిలిచారు.

నెలల తరబడి సాంకేతిక శిక్షణ, ప్రాక్టికల్ పరీక్షలు, అనుకరణ పోటీలు, పరిశ్రమ భాగస్వాములు, నిపుణుల పర్యవేక్షణ అనంతరం భారత పోటీదారులు షాంఘై చేరుకున్నారని దిలీప్ కుమార్ తెలిపారు. మొత్తం 70 మంది పోటీదారుల్లో 14 మంది పారిశ్రామిక శిక్షణ సంస్థలు---ఐటీఐలకు చెందినవారని వెల్లడించారు. నాలుగు రోజులపాటు జరిగే పోటీల్లో కచ్చితత్వం, సంయమనం, స్థిరమైన ప్రతిభను ప్రదర్శించడంపైనే దృష్టి పెట్టినట్లు చెప్పారు.

ప్రారంభ వేడుకలో టీమ్ ఇండియా కవాతును చూడటం ఎంతో గర్వకారణంగా నిలిచిందని మనీషా సెన్షర్మ పేర్కొన్నారు. భారతదేశంలోని నైపుణ్య శిక్షణ వ్యవస్థ



నుంచి వెలుగులోకి వస్తున్న ప్రతిభకు 70 మంది పోటీదారులు ప్రతినిధులుగా నిలుస్తున్నారని తెలిపారు. ప్రపంచంలోని అత్యుత్తమ ప్రతిభావంతులతో తమ సామర్థ్యాన్ని పోల్చుకోవడంతోపాటు అంతర్జాతీయ సహచరుల నుంచి నేర్చుకునే అవకాశమూ వారికి లభిస్తుందని చెప్పారు.

తొలిసారిగా 11 కొత్త విభాగాల్లో భారత్

ఈసారి టీమ్ ఇండియా ప్రాతినిధ్యం సంఖ్యాపరంగానే కాకుండా పోటీ విభాగాల పరంగానూ గణనీయంగా విస్తరించింది. భారత్ తొలిసారిగా కింది 11 కొత్త నైపుణ్య విభాగాల్లో పోటీపడుతోంది:

డెంటల్ ప్రోస్థెటిక్స్
డిజిటల్ ఇంటరాక్టివ్ మీడియా డిజైన్
ఇంటెలిజెంట్ సెక్యూరిటీ టెక్నాలజీ
ల్యాండ్‌స్కేప్ గార్డెనింగ్
ఆప్టోఎలక్ట్రానిక్ టెక్నాలజీ
రిటైల్ సేల్స్
మానవరహిత వైమానిక వ్యవస్థలు
ఇండస్ట్రియల్ మెకానిక్స్
సాఫ్ట్‌వేర్ టెస్టింగ్
హెవీ వెహికల్ టెక్నాలజీ
ఎయిర్‌క్రాఫ్ట్ మెయింటెనెన్స్

భారత పోటీదారులు కఠినమైన ఎంపిక ప్రక్రియను అధిగమించి, నెలలపాటు ప్రత్యేక శిక్షణ, నిరంతర సాధన, అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన సన్నద్ధతను పూర్తి చేసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వాలు, సెక్టార్ స్కిల్ కౌన్సిళ్లు, శిక్షణ సంస్థలు, పరిశ్రమ భాగస్వాములు, నిపుణులు, మార్గదర్శకులు వారికి సహకారం అందించారు.

వరల్డ్‌స్కిల్స్ ఇంటర్నేషనల్ ప్రతి రెండేళ్లకోసారి నిర్వహించే ఈ పోటీ ప్రపంచంలోనే అతిపెద్ద వృత్తివిద్య, శిక్షణ, నైపుణ్య ప్రతిభా వేదికగా గుర్తింపు పొందింది. సాంకేతిక నైపుణ్యం, కచ్చితత్వం, సృజనాత్మకత, పనితనం, ఆవిష్కరణ సామర్థ్యాలను ప్రదర్శించడంతోపాటు ప్రపంచ ప్రమాణాలతో తమ ప్రతిభను పోల్చుకునే అవకాశాన్ని యువ నిపుణులకు కల్పిస్తుంది.

షాంఘైలోని నేషనల్ ఎగ్జిబిషన్ అండ్ కన్వెన్షన్ సెంటర్‌లో బుధవారం ఉదయం 9 గంటలకు పోటీలు ప్రారంభమయ్యాయి. సెప్టెంబర్ 26 వరకు పోటీలు కొనసాగనుండగా, 27న ముగింపు వేడుక నిర్వహించనున్నారు. వరల్డ్‌స్కిల్స్ ఎక్స్‌పో, వరల్డ్‌స్కిల్స్ కాన్ఫరెన్స్‌లను కూడా ఇందులో భాగంగా నిర్వహిస్తున్నారు.

వరల్డ్‌స్కిల్స్ లియోన్--2024లో భారత్ నాలుగు కాంస్య పతకాలు, 12 'మెడలియన్స్ ఫర్ ఎక్సలెన్స్' సాధించింది. ఆ విజయాన్ని కొనసాగిస్తూ షాంఘై పోటీల్లోనూ అత్యుత్తమ ప్రదర్శన కనబరచాలని టీమ్ ఇండియా లక్ష్యంగా పెట్టుకుంది. భారత యువతలోని నైపుణ్యం, క్రమశిక్షణ, భవిష్యత్ అవసరాలకు అనుగుణమైన సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటేందుకు ఈ పోటీలు కీలక వేదికగా నిలవనున్నాయి.

## జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమానికి ఏర్పాట్లు

**చిలకలూరిపేట రూరల్ , పెన్ పవర్, సెప్టెంబర్ 23 :**

యడ్లపాడు మండలంలో జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని సెప్టెంబర్ 25న నిర్వహించనున్నట్లు యడ్లపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డా. పి. భరద్వాజ తెలిపారు. మండలంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, హాస్టళ్లలో 1 నుంచి 19 సంవత్సరాల వయస్సు గల 8,793 మంది పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు అందించనున్నట్లు పేర్కొన్నారు.

1 నుంచి 2 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు సగం మాత్ర, 3 నుంచి 19 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు పూర్తి మాత్ర అందించనున్నట్లు తెలిపారు. అనారోగ్యం లేదా ఇతర కారణాలతో సెప్టెంబర్ 25న మాత్రలు తీసుకోలేకపోయిన పిల్లలకుఅక్టోబర్5నమాత్రలుఅందించనున్నట్లువివరించారు.నులిపురుగుల కారణంగా పిల్లలు, కౌమార బాలబాలికల్లో ఏర్పడే రక్తహీనతను నివారించడంలో ఆల్బెండజోల్ మాత్రలు ఉపయోగపడతాయని తెలిపారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని ప్రతి సంవత్సరం ఫిబ్రవరి, సెప్టెంబర్



నెలల్లో నిర్వహిస్తున్నట్లు చెప్పారు.కార్యక్రమం నిర్వహణపై బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో కన్వర్జెన్స్ సమావేశం జరిగింది. సమావేశంలో ఎంపీపీ ఝాన్సీ సాగర్, ఎంపీడీవో హేమలతాదేవి, వివిధ శాఖలఅధికారులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు శాఖల మధ్య సమన్వయంతో చర్యలు చేపట్టాలని నిర్ణయించార

## ఆర్.వి.ఎస్.సి.వి.యస్ హైస్కూల్ హెచ్ఎం ఉప్పలపాటి వెంకటేశ్వరరావు అధ్యక్షతన ఘనంగా స్థానం నరసింహారావు జయంతి

**చిలకలూరిపేట , పెన్ పవర్, సెప్టెంబర్ 23 :**

చిలకలూరిపేట పట్టణంలోని ఆర్.వి.ఎస్.సి.వి.యస్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు ఉప్పలపాటి వెంకటేశ్వరరావు అధ్యక్షతన బుధవారం పద్మశ్రీ స్థానం నరసింహారావు జయంతి వేడుకలు పాఠశాలలో ఘనంగా జరిగాయి. జనవిజ్ఞాన వేదిక పల్నాడు జిల్లా శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న 'సాహితీ సాంస్కృతిక దశ దినోత్సవాల'లో భాగంగా ఐదవ రోజు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. సభకు అధ్యక్షత వహించిన హెచ్ఎం వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. అలాగే విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంపొందించేలా పాఠశాల గ్రంథాలయానికి 40 బాలసాహిత్య గ్రంథాలను అందజేశారు. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రముఖ రంగస్థల నటుడు, నంది అవార్డు గ్రహీత ఈనాడు ప్రసాద్ ముందుగా స్థానం నరసింహారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం రంగస్థలంపై స్త్రీ పాత్రధారిగా స్థానం



నరసింహారావు సాధించిన అద్భుత విజయాలను, ఆయన నటప్రస్థానాన్ని విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో జేవీవీ డివిజన్ అధ్యక్షులు ధూళిపాళ వెంకట్రావు, రాష్ట్ర ప్రచురణల విభాగం కన్వీనర్ డా.దార్ల బుజ్జిబాబు, ఉపాధ్యాయులు తంగళ్ళ సుధాకర హరి ప్రసాద్, ప్రేమలత తదితరులు పాల్గొన్నారు.

## స్పోర్ట్స్ కోటాలో 521 పోస్టులు.. అక్టోబర్ 12 నుండి దరఖాస్తులు

**పెన్ పవర్, సెప్టెంబర్, 23,**

?దేశంలోని నిరుద్యోగ క్రీడాకారులకు కేంద్ర ప్రభుత్వం గుడ్ న్యూస్ అందించింది. కేంద్ర రిజర్వ్ పోలీసు బలగం (సీఆర్పీఎఫ్) ఆధ్వర్యంలో స్పోర్ట్స్ కోటా కింద వివిధ విభాగాల్లో భారీ ఉద్యోగాల భర్తీకి అధికారిక ప్రకటన వెలువడింది. ఈ నోటిఫికేషన్ ద్వారా మొత్తం 521 ఖాళీలను భర్తీ చేయనున్నారు.

?ఈ ఉద్యోగాల్లో భాగంగా హెడ్ కానిస్టేబుల్ విభాగంలో 182 పోస్టులు, అలాగే కానిస్టేబుల్ (జనరల్ డ్యూటీ) విభాగంలో 339 పోస్టులను కేటాయించడం జరిగింది. వివిధ క్రీడాంశాలలో ప్రతిభ కనబరిచి, తగిన మెరిట్ సాధించిన అర్హులైన అభ్యర్థులు ఈ పోస్టుల కోసం దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించారు.

?ఈ పోస్టులకు సంబంధించిన ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియ వచ్చే నెల, అనగా అక్టోబర్ 12వ తేదీ నుండి అధికారికంగా ప్రారంభం కానుంది. ఆసక్తి మరియు




అర్హత ఉన్న క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు

## ఆకులమన్నాడులో ఘనంగా ఉచిత మెగా వైద్య శిబిరం



**ఆకులమన్నాడు, పెన్ పవర్, సెప్టెంబర్ 23:**

కృష్ణా జిల్లా ఆకులమన్నాడులో ఎక్స్ సర్పంచ్ మహమ్మద్ రఫీ ఆధ్వర్యంలో శ్రీకర హాస్పిటల్, విజయవాడ, కేర్ టు యాక్షన్ సంయుక్తంగా బుధవారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ విభాగాలకు చెందిన నిపుణులైన వైద్యులు గ్రామ ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి వైద్య సలహాలు, మందులు అందించారు. ఆర్థోపెడిక్, కార్డియాలజీ, డెర్మటాలజీ, నేత్ర వైద్య విభాగాల్లో సేవలు అందించారు. ఈసీజీ, షుగర్, 2డీ ఎకో తదితర పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడమే శిబిరం లక్ష్యమని మహమ్మద్ రఫీ తెలిపారు. ఆరోగ్య సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించి తగిన వైద్య సలహాలు పొందాలని సూచించారు. శిబిరానికి గ్రామ ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. కార్యక్రమం విజయవంతానికి సహకరించిన వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది, కేర్ టు యాక్షన్ ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

# శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో వసుంధరాదేవి
# ఎస్‌వీబీసీ చైర్మన్ శ్రీధర్‌వర్మకు అభినందనలు

**పెన్ పవర్, సెప్టెంబర్, 23,**

తిరుమలలో వైభవంగా జరుగుతున్న శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో ప్రముఖ సినీ నటుడు, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సతీమణి వసుంధరాదేవి బుధవారం పాల్గొన్నారు. శ్రీ వేంకటేశ్వర స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎస్‌వీబీసీ చైర్మన్ బి. శ్రీధర్‌వర్మ తన కుటుంబసభ్యులతోకలిసివసుంధరాదేవిని మర్యాదపూర్వకంగా కలుసుకుని ఆశీస్సులు పొందారు. ఎస్‌వీబీసీ చైర్మన్‌గా ఎన్నికైన శ్రీధర్‌వర్మను ఆమె అభినందించి, బాధ్యతలను విజయవంతంగా నిర్వహించాలని ఆకాంక్షించారు.

శ్రీధర్‌వర్మ వసుంధరాదేవి కుటుంబ సభ్యుల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. నందమూరి కుటుంబంపై శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని కోరుకున్నారు. శ్రీధర్‌వర్మతోపాటు ఆయన కుటుంబ సభ్యులను కలుసుకోవడం పట్ల వసుంధరాదేవి సంతోషం వ్యక్తం చేశారు.



ఈ కార్యక్రమంలో టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి, ముద్దాడ రవిచంద్ర, జేఈవో శరత్, చీఫ్ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ ఆఫీసర్ మురళీకృష్ణ, తిరుపతి ఎస్పీ సుబ్బరాయుడు, టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాశ్‌తోపాటు పలువురు పాలకమండలి సభ్యులు, అధికారులు పాల్గొన్నారు

# సాయిబాబా ఆలయం వద్ద కలశం కైవసం చేసుకున్న హాలియా క్లబ్ అధ్యక్షులు



**పెన్ పవర్, సెప్టెంబర్, 23,**

హాలియా: హాలియా పట్టణంలోని సాయిబాబా ఆలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో హాలియా క్లబ్ అధ్యక్షులు పొట్టుముత్తు వెంకటేష్ గుప్తా కలశాన్ని కైవసం చేసుకున్నారు.ఈ సందర్భంగా ఆలయానికి విచ్చేసిన భక్తులు, నిర్వాహకులు ఆయనకు అభినందనలు తెలిపారు. కార్యక్రమం భక్తిశ్రద్ధలతో కొనసాగింది.

# ఎస్ ఐ ఆర్ 2 సమీక్షా సమావేశంలో పాల్గొన్న శ్రీ మర్రి శశిధర్ రెడ్డి

**పెన్ పవర్, సెప్టెంబర్, 23,**

ఎస్ ఐ ఆర్ 2 పై ఈరోజు సికింద్రాబాద్ హరిహర కళా భవన్ లోని మున్సిపల్ కార్యాలయంలో అమీర్‌పేట్ డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ మరియు సనత్‌నగర్ ఈ ఆర్ ఓ శ్రీమతి సుజాత గారి ఆధ్వర్యంలో అఖిలపక్ష సమావేశం జరిగింది.ఈ సమావేశంలో ఎస్ ఐ ఆర్ విధానంపై చర్చించారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మంత్రివర్యులు, ఎన్ ఎం డి సి మాజీ ఉపాధ్యక్షులు మరియు బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యులు శ్రీ మర్రి శశిధర్ రెడ్డి గారు మాట్లాడుతూ, పెండింగ్‌లో ఉన్న నోటీసులను సంబంధిత ఓటర్లకు వెంటనే అందజేయాలని సూచించారు. నోటీసులు అందజేసిన వారి నుండి త్వరితగతిన జవాబులు తీసుకోవాలని కోరారు. ఏ ఒక్క అర్హత కలిగిన ఓటును కూడా కోల్పోకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని, ఒకవేళ అర్హత కలిగిన ఓటును తొలగిస్తే వారి తరపున పోరాడటానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు.




ఈ కార్యక్రమంలో ఏ ఈ ఆర్ ఓ గాయత్రీ, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నెమిలి ఆనంద్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇ. దయానంద్, ఇతర నాయకులు ఆకుల మహేష్, క్రాంతి కుమార్, వి. దయానంద్ రావు, శ్రీమతి అశ్విని తదితరులు పాల్గొన్నారు.

# 'డిజిటల్ గవర్నెన్స్'లో రోల్ మోడల్ గా తెలంగాణ

**-ఇంటి ముంగిటకే 'మీ సేవా' సేవలు**

**- తొలి దశలో 'క్యూర్' ప్రాంతాల్లో అమలు**

**-మీ సేవా డోర్ డెలివరీ సర్వీసెస్' ప్రారంభోత్సవంలో**

**మంత్రి శ్రీధర్ బాబు**

**పెన్ పవర్, సెప్టెంబర్, 23,**

"గుడ్ గవర్నెన్స్" కు టెక్నాలజీని జోడించి 'డిజిటల్ గవర్నెన్స్'లో తెలంగాణను దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఒక రోల్ మోడల్ గా తీర్చిదిద్దాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. పౌర సేవల్ని నేరుగా ఇంటి ముంగిటకే చేర్చేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామన్నారు. బుధవారం బాగ్ లింగంపల్లిలోని ఆర్టీసీ కళ్యాణ మండపంలో 'మీ సేవా డోర్ డెలివరీ సర్వీసెస్'ను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా పాలనలోనూ అనేక విప్లవాత్మక సంస్కరణలకు శ్రీకారం చుడుతున్నామన్నారు. అడ్మినిస్ట్రేషన్ కు టెక్నాలజీని జోడించి పారదర్శకత, జవాబుదారీతనం, సుపరిపాలనకు పెద్దపీట వేస్తున్నామన్నారు. ప్రభుత్వం, యంత్రాంగమే నేరుగా ప్రజల దగ్గరికే వెళ్లేలా ఈ 'డోర్ డెలివరీ సర్వీసెస్'కు శ్రీకారం చుట్టామన్నారు. 1100 టోల్ ఫ్రీ నంబర్ లేదా మీ సేవ పోర్టల్ ద్వారా స్లాట్ బుక్ చేసుకుంటే... జనన/మరణ ధృవీకరణ



పత్రాలు, ఆదాయ, కుల, నివాస సర్టిఫికేట్లు, ఈసీ కాపీలు, పోలీసు శాఖ సేవలు, ఐజీఆర్ఎస్ రిజిస్ట్రేషన్లు తదితర మీ సేవా సేవలను ఇంటి దగ్గరే అందిస్తామన్నారు. ఇందుకోసం 70 మందికి పైగా మీ సేవ ఏజెంట్లు, మీ సేవ వీఎల్ఈలకు ప్రత్యేక శిక్షణ ఇచ్చామన్నారు. తొలిదశలో 'క్యూర్' ప్రాంతాల్లో ఈ సేవలను ప్రారంభిస్తున్నామన్నారు. రాబోయే రోజుల్లో రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకూ విస్తరిస్తామన్నారు. పౌరులు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకుని... ఇంటి నుంచే పౌర సేవల్ని పొందాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఐటీఈఅండ్ సీ సంయుక్త కార్యదర్శి అనుదీప్ దురిశెట్టి, మీ సేవా కమిషనర్ రవి కిరణ్, టీజీటీఎస్ ఎండీ సత్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# విశాఖపట్నంలో ముగిసిన భారత్--శ్రీలంక నౌకాదళ విన్యాసం 'స్లైనెక్స్-26'

**పెన్ పవర్, సెప్టెంబర్, 23,**

భారత్--శ్రీలంక దేశాల మధ్య నిర్వహించిన 13వ ద్వైపాక్షిక సముద్ర నౌకాదళ విన్యాసం 'స్లైనెక్స్-26' సెప్టెంబర్ 21న విశాఖపట్నంలో ముగిసింది. సెప్టెంబర్ 17 నుంచి 21 వరకు నిర్వహించిన ఈ విన్యాసం ద్వారా రెండు దేశాల నౌకాదళ సిబ్బంది వృత్తిపరమైన అంశాలపై పరస్పరం చర్చించడంతోపాటు అత్యుత్తమ కార్యాచరణ పద్ధతులను పంచుకున్నారు. ఇరు నౌకాదళాల మధ్య సమన్వయం, పరస్పర కార్యాచరణ సామర్థ్యాన్ని మరింత మెరుగుపరుచుకున్నారు.

విన్యాసంలోని హార్బర్ దశలో భారత నౌకాదళం, శ్రీలంక నౌకాదళం మధ్య వృత్తిపరమైన చర్చలు, పరస్పర నౌకల సందర్శనలు, క్రీడా కార్యక్రమాలు నిర్వహించారు.

సముద్ర దశలో సమన్వయంతో కూడిన నౌకాదళ కదలికలు, వైమానిక కార్యకలాపాలు, రాత్రివేళ సముద్రంలో ఇంధనం, ఇతర అవసరాల సరఫరా విన్యాసాలు చేపట్టారు. ప్రత్యేక దళాలు నౌకలను సందర్శించడం, ఎక్కడం, తనిఖీ చేయడం, స్వాధీనం చేసుకోవడం వంటి 'విజిట్, బోర్డ్, సెర్చ్ అండ్ సీజర్' (వీబీఎస్ఎస్) విన్యాసాలతోపాటు హెలికాప్టర్ల నుంచి తాళ్ల సహాయంతో దిగే 'స్లిథరింగ్' కార్యకలాపాలను ప్రదర్శించాయి. ఈ విన్యాసాలు ఇరు దేశాల దళాల మధ్య కార్యాచరణ సమన్వయం, పరస్పర సహకార సామర్థ్యాన్ని



మెరుగుపరిచేందుకు దోహదపడ్డాయి.

భారత్--శ్రీలంక మధ్య బలమైన సముద్ర భాగస్వామ్యానికి 'స్లైనెక్స్-26' ప్రతీకగా నిలిచింది. సురక్షితమైన, స్థిరమైన హిందూ మహాసముద్ర ప్రాంతాన్ని నిర్మించాలన్న ఇరు దేశాల ఉమ్మడి నిబద్ధతను ఈ విన్యాసం చాటిచెప్పింది. సముద్ర సహకారం, పరస్పర కార్యాచరణ సామర్థ్యం, సామర్థ్య నిర్మాణాన్ని పెంపొందించడం ద్వారా భారతదేశ 'మహాసాగర్' దార్శనికతకు, 'నైబర్‌హుడ్ ఫస్ట్' విధానానికి ఈ విన్యాసం మరింత బలం చేకూర్చింది.ఖ

# ఉద్యోగుల న్యాయమైన సమస్యలను పరిశీలిస్తాం
# కేంద్ర సచివాలయ గ్రూప్--సి ఉద్యోగులకు కేంద్ర మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ హామీ

**12 ఏళ్లలో 23 వేలకుపైగా పదోన్నతులకు ఆమోదం**

**ఉద్యోగులకు అనుకూలమైన పని వాతావరణమే ప్రభుత్వ లక్ష్యం**

**పెన్ పవర్, సెప్టెంబర్, 23,**

కేంద్ర సచివాలయ గ్రూప్--సి ఉద్యోగులు ఎదుర్కొంటున్న న్యాయమైన సర్వీసు సమస్యలను తగిన సంస్థాగత విధానాల ద్వారా పరిశీలిస్తామని కేంద్ర మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ హామీ ఇచ్చారు. ఉద్యోగుల పదోన్నతులు, కేడర్ సమీక్ష, కెరీర్ పురోగతికి సంబంధించిన అంశాలపై వారు అందించే సూచనలకు ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు.

కేంద్ర సచివాలయ గ్రూప్--సి ఉద్యోగుల సంఘం ప్రతినిధులు మంగళవారం డాక్టర్ జితేంద్ర సింగ్‌తో సమావేశమయ్యారు. ఉద్యోగులతో తరచూ సమావేశమవుతూ, వారి సమస్యలు--సూచనలను స్వయంగా తెలుసుకుంటున్నందుకు మంత్రికి వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కెరీర్ పురోగతి, కేడర్ సమీక్ష, ప్రస్తుత కేడర్ నిర్మాణం, పరిమిత శాఖాపరమైన పోటీ పరీక్ష (ఎల్‌డీసీఈ) తదితర అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

ఈ సమావేశంలో డాక్టర్ జితేంద్ర సింగ్ మాట్లాడుతూ, ఉద్యోగులు ఉత్సాహంగా పనిచేస్తూ తమ బాధ్యతలను సమర్థంగా నిర్వర్తించేందుకు అనుకూలమైన పని వాతావరణాన్ని కల్పించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఉద్యోగులకు అనేక డిమాండ్లు ఉండవచ్చని, వాటిలో న్యాయమైన సమస్యలను సంబంధిత వ్యవస్థల ద్వారా పరిశీలిస్తామని చెప్పారు. సర్వీసు, కేడర్‌కు



సంబంధించిన సమస్యలపై ఉద్యోగులు అందించే సూచనలు ప్రభుత్వానికి ఎంతో ముఖ్యమన్నారు.

**పదోన్నతులపై ప్రత్యేక దృష్టి**

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల పదోన్నతులకు సంబంధించిన సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం నిరంతరం చర్యలు చేపడుతోందని మంత్రి వెల్లడించారు. గత 12 సంవత్సరాల్లో 23 వేలకుపైగా పదోన్నతులకు మార్గం సుగమం చేసినట్లు తెలిపారు. సకాలంలో కెరీర్ పురోగతి కల్పించడం ద్వారా ఉద్యోగుల్లో ప్రేరణ పెరగడంతోపాటు పరిపాలనా వ్యవస్థ మరింత సమర్థంగా పనిచేస్తుందని పేర్కొన్నారు.

కేంద్ర సచివాలయం పరిధిలోని 135 మంత్రిత్వ శాఖలు, విభాగాలు, సంస్థల్లో పనిచేస్తున్న 8 వేల మందికిపైగా గ్రూప్--సి ఉద్యోగులకు ఈ సంఘం ప్రాతినిధ్యం వహిస్తోంది. తమ సభ్యుల సర్వీసు నిబంధనలు, పదోన్నతి అవకాశాలు, కెరీర్ పురోగతికి సంబంధించిన సమస్యలను ప్రతినిధులు మంత్రికి వివరంగా తెలియజేశారు.

కేడర్ సమీక్ష, ప్రస్తుత కేడర్ నిర్మాణంలో మార్పులు, పదోన్నతి అవకాశాలను ప్రభావితం చేస్తున్న అంశాలను పరిశీలించాలని ఉద్యోగ సంఘం కోరింది. ఈ సూచనలను తగిన సంస్థాగత యంత్రాంగం ద్వారా పరిశీలిస్తామని డాక్టర్ జితేంద్ర సింగ్ తెలిపారు.

ఉద్యోగులతో నిరంతర సంప్రదింపులు

ఉద్యోగులతో క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహించడం వల్ల వారి వాస్తవ సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకునే అవకాశం కలుగుతుందని మంత్రి పేర్కొన్నారు. ఉద్యోగుల న్యాయమైన సమస్యలను పరిష్కరిస్తూనే, వారు ఉత్సాహంగా పనిచేసే వాతావరణాన్ని సృష్టించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు.

కేంద్ర సచివాలయ సేవల్లో పదోన్నతుల నిలిచిపోవడాన్ని నివారించేందుకు ప్రభుత్వం ఇటీవల భారీ స్థాయిలో పదోన్నతుల ప్రక్రియ చేపట్టింది. 2022 జూన్ 30న ఒక్కరోజే 8 వేలకుపైగా పదోన్నతులు కల్పించగా, 2022 నుంచి 2024 మధ్య వివిధ గ్రేడుల్లో 16,200కుపైగా పదోన్నతి ఉత్తర్వులు జారీ చేసినట్లు అధికారులు పేర్కొన్నారు.

కేడర్ సమీక్షతోపాటు సర్వీసుకు సంబంధించిన వాస్తవ సమస్యలను ఉద్యోగ ప్రతినిధులు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని మంత్రి సూచించారు. నిర్మాణాత్మక చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవాలని పిలుపునిచ్చారు. తమ సమస్యలను నేరుగా వివరించే అవకాశం కల్పించినందుకు ఉద్యోగ సంఘం ప్రతినిధులు డాక్టర్ జితేంద్ర సింగ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

# దేశానికి, సమాజానికి ప్రయోజనం చేకూర్చినప్పుడే విద్యకు సార్థకత
# మహారాజా సయాజీరావు విశ్వవిద్యాలయం 75వ స్నాతకోత్సవంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము



**పెన్ పవర్, సెప్టెంబర్, 23,**

గుజరాత్‌లోని వడోదరలో ఉన్న మహారాజా సయాజీరావు విశ్వవిద్యాలయం 75వ వార్షిక స్నాతకోత్సవానికి భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గత 75 సంవత్సరాలుగా ఈ విశ్వవిద్యాలయం విభిన్న విజ్ఞాన రంగాలను సమన్వయం చేసుకుంటూ ప్రగతి పథంలో ముందుకు సాగుతోందని ఆమె ప్రశంసించారు. ప్రస్తుత ప్రపంచంలో ఏ సమస్యకూ ఒకే విద్యా విభాగం పరిధిలో పరిష్కారం లభించదని రాష్ట్రపతి పేర్కొన్నారు. సమాజం ఎదుర్కొంటున్న కీలక సవాళ్లను పరిష్కరించేందుకు బహుళ విద్యా విభాగాల సమన్వయంతో కూడిన దృక్పథం అవసరమని స్పష్టం చేశారు. శాస్త్రవేత్తలోని జిజ్ఞాస, కళాకారుడిలోని సున్నితత్వం, చరిత్రకారుడి దృక్పథం, ఆర్థికవేత్తలోని లోతైన అవగాహన, సామాజిక శాస్త్రవేత్తలోని సామాజిక చైతన్యం---ఇవన్నీ సమ్మిళితం కావాలని తెలిపారు. ఈ దిశగా మహారాజా సయాజీరావు విశ్వవిద్యాలయం వంటి ఉన్నత విద్యాసంస్థలు నిరంతరం అప్రమత్తంగా, చైతన్యవంతంగా వ్యవహరించాలని సూచించారు.

పట్టాలు అందుకున్న విద్యార్థులు తమ విద్య, జ్ఞానం వెనుక ఉన్న అసలైన లక్ష్యాన్ని ఆత్మపరిశీలన చేసుకోవాలని రాష్ట్రపతి పిలుపునిచ్చారు. దేశం, సమాజ ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇస్తూ వృత్తి జీవితంలో ముందుకు సాగితే వ్యక్తిగత పురోగతితోపాటు అపారమైన ఆత్మసంతృప్తి కూడా లభిస్తుందని చెప్పారు.

దేశానికి, సమాజానికి ప్రయోజనం చేకూర్చినప్పుడే విద్యకు నిజమైన సార్థకత లభిస్తుందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. ఇంజినీర్లు ప్రజల జీవితాలను మెరుగుపరిచే సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేయాలని సూచించారు. వైద్యులు తమ వృత్తిని కేవలం ఉపాధిగా కాకుండా సేవగా భావించాలని, శాస్త్రవేత్తలు మానవాళి ప్రయోజనాల కోసం సమస్యలకు పరిష్కారాలను కనుగొనాలని కోరారు.

కళాకారులు, రచయితలు సమాజంలోని సున్నితత్వాన్ని, మానవీయ విలువలను మరింత సుసంపన్నం చేయాలని తెలిపారు. పారిశ్రామికవేత్తలు సంపద సృష్టించడంతోపాటు ఉపాధి, అవకాశాలను కల్పించాలని సూచించారు. ఉపాధ్యాయులు వారసత్వాన్ని గౌరవిస్తూ ప్రగతిని స్వీకరించే యువతరాన్ని తీర్చిదిద్దాలని చెప్పారు. ప్రజాజీవితంలో ఉన్నవారు తమ పదవిని అధికారానికి చిహ్నంగా కాకుండా బాధ్యతగా భావించాలని హితవు పలికారు.

2047 నాటికి 'వికసిత భారత్' నిర్మాణమనే జాతీయ లక్ష్యంతో దేశం ముందుకు సాగుతోందని రాష్ట్రపతి తెలిపారు. నాణ్యమైన విద్య, వైద్య సదుపాయాలు ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉండేలా చూడటం, శాస్త్రసాంకేతిక పరిజ్ఞానాన్ని మానవ సంక్షేమానికి వినియోగించడం, అందరికీ సమాన అవకాశాలు కల్పించడం ఈ లక్ష్యంలో భాగమని పేర్కొన్నారు.

మహిళలు, యువతలోని పూర్తి సామర్థ్యాన్ని దేశాభివృద్ధికి ఉపయోగించుకోవాలని, ప్రతి పౌరుడూ గౌరవప్రదంగా జీవించే అవకాశాన్ని పొందే భారతదేశాన్ని నిర్మించాలని ఆకాంక్షించారు. ఈ లక్ష్యాలను సాధించడంలో విశ్వవిద్యాలయాలు, యువత కీలక పాత్ర పోషించాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పిలుపునిచ్చారు.

ఈ సమావేశంలో ఎస్ ఐ ఆర్ విధానంపై చర్చించారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మంత్రివర్యులు, ఎన్ ఎం డి సి మాజీ ఉపాధ్యక్షులు మరియు బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యులు శ్రీ మర్రి శశిధర్ రెడ్డి గారు మాట్లాడుతూ, పెండింగ్‌లో ఉన్న నోటీసులను సంబంధిత ఓటర్లకు వెంటనే అందజేయాలని సూచించారు. నోటీసులు అందజేసిన వారి నుండి త్వరితగతిన జవాబులు తీసుకోవాలని కోరారు. ఏ ఒక్క అర్హత కలిగిన ఓటును కూడా కోల్పోకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని, ఒకవేళ అర్హత కలిగిన ఓటును తొలగిస్తే వారి తరపున పోరాడటానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఏ ఈ ఆర్ ఓ గాయత్రీ, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నెమిలి ఆనంద్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇ. దయానంద్, ఇతర నాయకులు ఆకుల మహేష్, క్రాంతి కుమార్, వి. దయానంద్ రావు, శ్రీమతి అశ్విని తదితరులు పాల్గొన్నారు.

# 111 సినీ గీతాలతో అరుదైన రికార్డు
# ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో గాయని మల్లాది ఉషారాణి

**20 మంది సహ గాయకులతో 12 గంటలపాటు నిర్విరామ సంగీత ప్రదర్శన**

**పెన్ పవర్, సెప్టెంబర్, 23,**

ప్రముఖ గాయని శ్రీమతి మల్లాది ఉషారాణి 12 గంటలపాటు నిర్విరామంగా 111 సినీ గీతాలను ఆలపించి అరుదైన ఘనత సాధించారు. ఈ సంగీత ప్రదర్శన ద్వారా ఆమె నాలుగు ప్రతిష్ఠాత్మక రికార్డులు, అవార్డులను సొంతం చేసుకున్నారు.

సెప్టెంబర్ 19న చిక్కడపల్లిలోని శ్రీ త్యాగరాయ గానసభలో నిర్వహించిన ప్రత్యేక సంగీత కార్యక్రమంలో ఉషారాణి 20 మంది సహ గాయకులతో కలిసి మొత్తం 111 పాటలను ఆలపించారు. 1932 నుంచి 2024 వరకు సుమారు 50 మంది ప్రముఖ గాయనీమణులు ఆలపించిన సినీ గీతాలను ఎంపిక చేసుకొని ప్రదర్శించడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

తొలితరం గాయని రావు బాలసరస్వతీదేవి నుంచి నేటి తరం గాయని గీతా మాధురి వరకు వివిధ తరాలకు చెందిన గాయనీమణుల పాటలను ఆమె తనదైన శైలిలో ఆలపించారు. శ్రీరంగం గోపాలరత్నం, జిక్కి, లీల, పి.సుశీల, ఎస్.జానకి తదితర ప్రముఖ సినీ నేపథ్య గాయనీమణుల గీతాలను ఆలపించి ప్రేక్షకులను అలరించారు.

ఈ అద్భుత ప్రదర్శనతో మల్లాది ఉషారాణి ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్, ఇండియన్ ఐకాన్ అవార్డ్స్, వావ్ మ్యూజిక్ నంది అవార్డ్స్, గ్లోబల్ మల్టీ టాలెంట్ అవార్డ్స్ గుర్తింపు పొందారు.



శ్రీవరం సుస్వరాలు, గ్లోబల్ టాలెంటెడ్ మ్యూజికల్ ఆర్ట్స్ ఫౌండేషన్, ఇండియన్ కల్చరల్ ఐకాన్ అవార్డ్స్, ఉషా మ్యూజిక్ అండ్ కల్చరల్ ఆర్గనైజేషన్, పీఎంఎస్ఎస్ఎస్ సంస్థలు సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాయి.

ఈ సందర్భంగా బింగి నరేందర్ గౌడ్, మూర్తి శ్రీరామ్, నాగ శివరామ్, త్రినాథరావు, సుధారాణి తదితర ముఖ్య అతిథుల చేతుల మీదుగా మల్లాది ఉషారాణి అవార్డులను అందుకున్నారు. సంగీతంపై అంకితభావంతో 20 మంది సహ గాయకుల సహకారంతో 111 పాటలను ఆలపించి సరికొత్త రికార్డు నెలకొల్పడం అభినందనీయమని అతిథులు కొనియాడారు.

# అంబటి అడ్డంగా బుక్కైనట్టేనా



**గుంటూరు, సెప్టెంబర్ 23,పెన్ పవర్:** లిక్కర్ స్కామ్‌లో ఈడీ నోటీసులు ఇస్తే 90 ఎంఎల్ డైలాగులు చెప్పిన అంబటి రాంబాబుకు అసలు నిజం తెలుసు. లిక్కర్ స్కామ్ వ్యవహారంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ నోటీసులు జారీ చేయడంతో ఆయన గారికి అసలు భయం పట్టుకుంది. తొలుత ఈడీ నోటీసులే రాలేదని, తనకేమీ తెలియనట్లు అమాయకపు నటన ప్రదర్శించిన అంబటి.. తీరా విషయం ముదిరి పాకాన పడటంతో నాకేం భయం లేదు.. ఆరోగ్యం కుదుటపడ్డాక విచారణకు వెళ్తా అంటూ కొత్త కవరింగ్ కథనాలు మొదలుపెట్టారు. ఎందుకంటే ఆయన దందాపై పూర్తి సాక్ష్యాలు ఈడీ వద్ద ఉన్నాయి.అంబటి రాంబాబు ఎంత నాటకమాడినా మద్యం కుంభకోణంలో ఆయన పాత్రను దర్యాప్తు సంస్థలు పక్కా ఆధారాలతో పట్టుకున్నాయనేది బహిరంగ రహస్యంగా మారింది. అంబటి రాంబాబుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ నోటీసులు జారీ చేసింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో భారీ ఎత్తున సాగిన మద్యం కుంభకోణం కేసుకు సంబంధించి ఈడీ ఈ నోటీసులు జారీ చేసింది. మద్యం విధానంలో జరిగిన అవకతవకలు, నిధుల మళ్లింపు, మనీలాండరింగ్ కోణాల్లో దర్యాప్తును వేగవంతం చేసిన కేంద్ర దర్యాప్తు సంస్థ.. తమ ఎదుట విచారణకు హాజరుకావాల్సిందిగా ఆయనను ఆదేశించింది.ప్రభుత్వ హయాంలో జరిగిన మద్యం రవాణా, విక్రయాల ప్రక్రియలో అంబటి రాంబాబు పాత్రపై ఈడీ ప్రత్యేకంగా దృష్టి సారించింది. మద్యం అక్రమ రవాణాకు సంబంధించిన సబ్ కాంట్రాక్టులను నిబంధనలకు విరుద్ధంగా అంబటి బినామీ సంస్థలకు కట్టబెట్టారనే అభియోగాలు దర్యాప్తులో తెరపైకి వచ్చాయి. మద్యం సిండికేట్ల నుంచి ముడుపులు ఎలా మళ్లాయి, వాటి వెనుక ఉన్న బినామీ నెట్‌వర్క్, డొల్ల కంపెనీల ఆర్థిక లావాదేవీలపై అధికారులు లోతైన ఆధారాలు సేకరించినట్లు సమాచారం. ఈ క్రమంలోనే పీఎంఎల్ఏ చట్టం కింద అంబటికి నోటీసులు జారీ చేసి సమగ్ర వివరణ కోరింది.ఈ నోటీసుల వ్యవహారాన్ని అంబటి దాచి పెట్టే ప్రయత్నం చేశారు. రెండు వారాలుగా అనారోగ్య కారణాలతో తాను హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్నానని, ఈ క్రమంలోనే ఈడీ అధికారులు ఫోన్ చేసి ఈనెల 11నే నోటీసులు పంపినట్లు చెప్పారని ఆయన పేర్కొన్నారు. అయితే నోటీసులు చేతికి రాకపోవడం వల్లే విచారణకు రాలేకపోయానని, ఏ కేసులో నోటీసులు ఇచ్చారనేది పత్రాలు చూస్తే తప్ప స్పష్టత రాదని అధికారులకు తెలిపినట్లు సమాచారం. మరోవైపు, ఈవారంలోనే హైదరాబాద్ , విజయవాడలోని ఈడీ కార్యాలయంలో ఆయన విచారణకు హాజరయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.ఏపీ లిక్కర్ స్కామ్‌పై ఓవైపు రాష్ట్ర సిట్ , మరోవైపు ఈడీ దర్యాప్తును ముమ్మరం చేస్తుండటంతో వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఇప్పటికే ఈ కేసులో పలువురు కీలక వ్యక్తులు, ప్రజాప్రతినిధులు దర్యాప్తు సంస్థల విచారణను ఎదుర్కొంటున్నారు. కారుమూరి, ఆయన కుమారుడు జైలు పాలయ్యారు. అంబటి తనకేమీ సంబంధం లేదని బుకాయించే ప్రయత్నం చేసినా.. ఆధారాల్లేకుండా ఈడీ నోటీసులు ఇచ్చే అవకాశం ఉండదు.జగన్ హయాంలో ప్రభుత్వం అధికారంలోకి రాగానే తన బినామీలుగా ప్రచారంలో ఉన్న సుబ్బారెడ్డి, పురుషోత్తం అనే వ్యక్తులను రంగంలోకి దించిన అంబటి.. వారికి మద్యం సరఫరా, డిస్ట్రిబ్యూషన్ కాంట్రాక్టులు కట్టబెట్టారని విచారణలో తేలినట్లు సమాచారం. ఆ కాంట్రాక్టర్ల వద్ద నుంచి భారీ ఎత్తున కమిషన్లు, నిధులు దండుకున్న వైనంపై సిట్, ఈడీలకు సదరు బినామీలే స్వయంగా పూసగుచ్చినట్లు వివరాలు ఇచ్చేశారని, డబ్బులు ఎలా మార్పిడి జరిగాయో ఆధారాలతో సహా అప్పగించారని ప్రచారం జరుగుతోంది.అంబటి గారు అడ్డంగా దొరికిపోవడంతోనే ఇప్పుడు అసలైన వణుకు మొదలైంది. ఇప్పటికే నేతలు కారుమూరి నాగేశ్వరరావు లాంటి వారు జైలు బాట పట్టిన దృశ్యాలు కళ్లముందు కదులుతుండటంతో, ఎక్కడ ఈడీ అధికారులు తనను కూడా నేరుగా అదుపులోకి తీసుకుని రిమాండ్ కార్డ్ ఇస్తారోనని ఆయన భయాందోళనకు గురవుతున్నారు. సాధారణ పోలీసు కేసుల్లా కాకుండా, ఈడీ చట్టం కింద అరెస్ట్ అయితే అంత సులువుగా బెయిల్ రాదని, ఎంతటి వారికైనా కటకటాలు తప్పవని తెలిసి ఆయన నిద్రలేని రాత్రులు గడుపుతున్నారనే గుసగుసలు వినిపిస్తున్నాయి.టివి ఛానళ్లలో ఎదుటివారిపై పంచ్‌లు వేస్తూ, వెటకారాలతో కాలక్షేపం చేసిన అంబటి రాంబాబుకు.. ఇప్పుడు తన సొంత బినామీలే ఇచ్చిన వాంగ్మూలాలు పెద్ద ఉచ్చుగా మారాయి. మైకుల ముందు నాకేం భయం లేదు అని ఎంత గంభీరంగా నటించినా, లోలోపల మాత్రం ఈడీ అరెస్ట్ వారెంట్ ఎప్పుడు తలుపు తడుతుందోనని బెదిరిపోతున్నారనేది స్పష్టమవుతోంది. గతంలో నడిపిన లీలలు ఒక్కొక్కటిగా బయటపడుతుంటే, ఈడీ విచారణ నుంచి తప్పించుకోవడానికి ఆరోగ్యం సాకుగా చూపే కవరింగ్ డ్రామాలు ఇకపై చెల్లకపోవచ్చు.

# పిఠాపురంలో పవన్ మార్క్

**కాకినాడ సెప్టెంబర్ 23, పెన్ పవర్:** డిప్యూటీ సీఎం క్యాంపు ఆఫీసును పిఠాపురానికి మార్చాలని పవన్ కల్యాణ్ నిర్ణయించుకున్నారు తన వద్దకు సమస్యల పరిష్కారం కోసం వస్తున్న ప్రజల అర్జీలను స్వీకరించడానికి, స్థానిక సమస్యలను నేరుగా పర్యవేక్షించడానికి ఏర్పాటు చేసిన పార్టీ కమిటీ పనితీరుపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో పర్యటించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు మరింత అందుబాటులో ఉండేందుకు డిప్యూటీ సీఎం క్యాంప్ ఆఫీస్‌నే పిఠాపురానికి తరలించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు.తన పర్యటనల్లో అనేకమంది ప్రజలు వినతిపత్రాలు చేతుల్లో పట్టుకుని కిలోమీటర్ల మేర నిలబడుతుండటం తనను తీవ్రంగా ఆలోచింపజేసిందని పవన్ కళ్యాణ్ తెలిపారు. పిఠాపురం ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు , వారి వినతులను స్వీకరించేందుకు జనసేన తరఫున ఒక ప్రతినిధి కమిటీని నియమించినప్పటికీ, ఆ కమిటీ బాధ్యతాయుతంగా పనిచేయడం లేదని తన దృష్టికి వచ్చిందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించడంపై అసహనం వ్యక్తం చేసిన ఆయన, ఇకపై బాధ్యతలను నేరుగా తమ ప్రభుత్వ యంత్రాంగమే చూసుకుంటుందని స్పష్టం చేశారు.స్థానిక నాయకత్వం , కమిటీ పనితీరు సరిగా లేకపోవడంతో, తానే స్వయంగా ప్రజా సమస్యలను పర్యవేక్షించాలని నిర్ణయించుకున్నట్లు పవన్ పేర్కొన్నారు. అందులో భాగంగానే డిప్యూటీ సీఎం క్యాంప్ ఆఫీస్ సేవలను పిఠాపురానికి విస్తరించడం, ఇక్కడి నుంచే నిర్వహించేలా మార్పులు చేయాలని సంబంధిత అధికారులకు సూచించినట్లు తెలిపారు. పూర్తిస్థాయి క్యాంప్ ఆఫీస్ ఏర్పాటుకు మరో మూడు నుంచి నాలుగు నెలల సమయం పడుతుందని, ఆ తర్వాత స్థానిక పాలన, ప్రజా అర్జీల స్వీకరణ అంతా పిఠాపురం నుంచే జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు.తనను గెలిపించిన పిఠాపురం నియోజకవర్గాన్ని



దేశంలోనే ఒక మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని పవన్ కళ్యాణ్ ప్రకటించారు. కేవలం మాటలకే పరిమితం కాకుండా, నియోజకవర్గానికి అవసరమైన అభివృద్ధి పనులతో పాటు ప్రజల వ్యక్తిగత, సామాజిక సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు నిరంతరం అందుబాటులో ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ నిర్ణయంతో పిఠాపురం నియోజకవర్గం త్వరలోనే రాష్ట్ర రాజకీయాలకు , పాలనకు కేంద్రబిందువుగా మారనుంది.ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, పిఠాపురం శాసనసభ్యుడు పవన్ కళ్యాణ్ తన సొంత నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఒక మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగుతున్నారు. నియోజకవర్గ పరిధిలోని ప్రతి గ్రామం, మున్సిపాలిటీకి అవసరమైన మౌలిక వసతుల కల్పన, పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ , ఆధునిక సదుపాయాల సమకూర్చే దిశగా దాదాపు రూ. 1,500 కోట్ల వ్యయంతో బహుళ అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. పిఠాపురం సమగ్రాభివృద్ధి లక్ష్యంగా పాలనాపరమైన, ఆర్థికపరమైన సంస్కరణలను వేగవంతం చేస్తున్నారు.ప్రత్యేకించి నియోజకవర్గంలో భూగర్భ జలాల పునరుద్ధరణ, గ్రామీణ పర్యావరణ పరిరక్షణలో భాగంగా చెరువుల సుందరీకరణకు పవన్ ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చారు. ఫకృద్దీన్ పాలెంలో మైసమ్మ చెరువును రూ. 73 లక్షలతో సుందరీకరించి వాకింగ్ ట్రాక్, చిల్డ్రన్స్ పార్క్, ఓపెన్ ఎయిర్ జిమ్ వంటి వసతులతో గ్రామ ప్రజలకు ఆహ్లాదకర కేంద్రంగా తీర్చిదిద్దారు. నియోజకవర్గ వ్యాప్తంగా రూ. 6 కోట్లకు పైగా వ్యయంతో 14 చెరువులను ఆధునీకరించి, గ్రామీణ ప్రాంతాలకు కొత్త శోభను తీసుకువస్తున్నారు.పట్టణ పర్యావరణం, ప్రజారోగ్యాన్ని మెరుగుపరిచేందుకు జాతీయ రహదారికి సమీపంలో ఆరు ఎకరాల విస్తీర్ణంలో రూ.1.83 కోట్ల వ్యయంతో పీఠికాపుర వనం పట్టణ అటవీ ప్రాజెక్టును ఆవిష్కరించారు. చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాల ఏర్పాటు, పాఠశాలలు,

ప్రభుత్వ ఆసుపత్రుల ఆధునీకరణ, మోడల్ అంగన్వాడీ కేంద్రాల నిర్వహణతో పాటు రోడ్లు, డ్రైనేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారాన్ని చూపుతున్నారు. పిఠాపురం పుణ్యక్షేత్రమైనందున పర్యాటకాభివృద్ధికి సైతం పెద్దపీట వేస్తున్నారు.అభివృద్ధి పనులను నిరంతరం పర్యవేక్షించేందుకు , పరిపాలనా వేగాన్ని పెంచేందుకు పిఠాపురం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ కి స్వయంప్రతిపత్తి హోదాను కల్పించారు. కాకినాడ జిల్లా కలెక్టర్ నేతృత్వంలో పనిచేసే ఈ సంస్థ ద్వారా ప్రణాళికాబద్ధంగా మౌలిక వసతులు, ఆర్థిక వృద్ధి , ఉపాధి అవకాశాలను కల్పించే దిశగా పనులు శరవేగంగా సాగుతున్నాయి. పవన్ కళ్యాణ్ తీసుకుంటున్న ఈ చొరవలతో పిఠాపురం రూపురేఖలు వేగంగా మారుతున్నాయి.

# కొత్త మిత్రుల కోసం జగన్ వ్యూహాలు

**విజయవాడ, సెప్టెంబర్ 23, పెన్ పవర్:** 2024 ఎన్నికల ఓటమి తర్వాత ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అత్యంత క్లిష్టమైన పరిస్థితిని ఎదుర్కొంటోంది. పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి గతంలో లాగా ఒంటరి పోరాటం చేయడానికి ఇప్పుడు వెనుకడుగు వేస్తున్నారు. కూటమి భుత్వం అత్యంత బలంగా ఉండటం, క్షేత్రస్థాయిలో వైసీపీ కేడర్ చెల్లాచెదురు కావడం, వరుస కేసులు, అరెస్టులతో .. జగన్మోహన్ రెడ్డి ఇప్పుడు ప్రత్యక్షంగా , పరోక్షంగా అదనపు బలాల కోసం ఆరాటపడుతున్నారు. తాము ఎవరితోనైనా కలిసి పోరాడేందుకు సిద్ధంగా ఉన్నామని వైసీపీ ముఖ్య నేత సజ్జల రామకృష్ణారెడ్డి పదే పదే సంకేతాలు పంపుతున్నా.. అటువైపు నుండి సానుకూల స్పందన కరువైంది.జగన్మోహన్ రెడ్డి రాజకీయ వ్యూహాలు ఎప్పుడూ భిన్నంగా ఉంటాయి. ప్రస్తుతం ఆయన పరోక్ష రాజకీయంపైనే ఎక్కువ నమ్మకం పెట్టుకున్నట్లు కనిపిస్తోంది. సోషల్ మీడియాలో వ్యవస్థలను, కూటమి నేతలను టార్గెట్ చేయడానికి జోసఫ్ రావణ్ వంటి వారిని భారీ బడ్జెట్‌తో రెడీ చేసుకుని, షాడో పాలిటిక్స్ నడుపుతున్నారు. కానీ, ప్రత్యక్షంగా తన ఓటు బ్యాంకుకు అదనపు ఓటు బ్యాంకును జోడించగల బలమైన పార్టీలను మాత్రం ఆయన దరిచేర్చుకోలేకపోతున్నారు. మరోవైపు జడ శ్రవణ్ కుమార్ వంటి నేతలు, దళిత ఓటు బ్యాంకును టార్గెట్ చేస్తూ జగన్ రాజకీయాలలోని లోపాలను ఎండగడుతున్నారు. ఇది వైసీపీకి కోలుకోలేని దెబ్బగా పరిణమించే అవకాశం ఉంది.ప్రస్తుత రాజకీయ సమీకరణాలలో జగన్మోహన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీతో కలిసే అవకాశం

ఏమాత్రం లేదు. రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ ఉనికి నామమాత్రంగానే ఉన్నా, జాతీయ స్థాయిలో ఆ పార్టీతో వైసీపీ బంధం కుదరదు. పైగా, రాష్ట్రంలో పిసిసి అధ్యక్షురాలిగా ఉన్న తన సోదరి వైఎస్ షర్మిల తో ఉన్న తీవ్రమైన ఆస్తుల వివాదం, రాజకీయ వైరం కారణంగా జగన్ కాంగ్రెస్‌తో వెళ్లాలనుకున్నా వెళ్లలేరు. ఇక మిగిలిన ప్రధాన పార్టీలన్నీ కూటమిలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో, కనీసం కమ్యూనిస్టు పార్టీలైనా వైసీపీతో కలిసి వస్తాయని జగన్ ఆశిస్తున్నారు. ఇందుకోసం లెఫ్ట్ పార్టీల నేతలతో వైసీపీ రాయబారాలు నడుపుతున్నట్లు వార్తలు వస్తున్నాయి.కనీసం లెఫ్ట్ పార్టీలైనా వైసీపీతో కలిసి నడుస్తాయా? అనేది ఇప్పుడు పెద్ద ప్రశ్న. కమ్యూనిస్టు పార్టీలు సిద్ధాంతపరంగా బీజేపీని తీవ్రంగా వ్యతిరేకిస్తాయి. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి పార్లమెంట్‌లో పదేళ్లపాటు పరోక్షంగా పూర్తి మద్దతు ఇచ్చిన వైసీపీతో కమ్యూనిస్టులు కలవడం అంత ఈజీ కాదు. పైగా, గత వైసీపీ హయాంలో అమరావతి రైతుల పోరాటం, విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ

ప్రైవేటీకరణ, ఉద్యోగుల సమస్యలపై లెఫ్ట్ పార్టీలు వైసీపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడాయి. ఇప్పుడు అకస్మాత్తుగా జగన్మోహన్ రెడ్డితో చేతులు కలిపితే.. ఆ పార్టీల విశ్వసనీయత దెబ్బతింటుందని కొందరు లెఫ్ట్ నేతలు భావిస్తున్నారు. కూటమి ప్రభుత్వంపై ఉన్న ప్రజా వ్యతిరేకతను వాడుకోవడానికి సిద్ధాంతాలను పక్కనబెట్టి వైసీపీతో జతకడతారా? లేదా ఒంటరి గానే పోరాడతారా? అన్నది వేచి చూడాలి.నలుగురు మిత్రులు లేకుండా రాజకీయం చేయడం ఎంత కష్టమో జగన్మోహన్ రెడ్డికి ఇప్పుడు అర్థమవుతోంది. పరోక్ష వ్యూహాలు కొంతవరకు బజ్ క్రియేట్ చేయగలవు కానీ, ప్రత్యక్షంగా ఎన్నికలలో గెలవాలంటే బలమైన సామాజిక, రాజకీయ సమీకరణాలు అవసరం. ఒకవైపు తన ఓటు బ్యాంకును జడ శ్రవణ్ వంటి వారు టార్గెట్ చేస్తుంటే, మరోవైపు మిత్రపక్షాల కోసం సజ్జల రామకృష్ణారెడ్డి పంపుతున్న సందేహాలను ఎవరూ పట్టించుకోవడం లేదు. కనీసం కమ్యూనిస్టులైనా వైసీపీతో కలవకపోతే.. రాబోయే రోజుల్లో వైసీపీ ఉనికి మరింత ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఉంది.

## ఈడీ దూకుడు...

**విజయవాడ, సెప్టెంబర్ 23, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో దశాబ్దంలోనే అతిపెద్ద ఆర్థిక అక్రమంగా విచారణ ఎదుర్కొంటున్న రూ.3,200 కోట్ల లిక్కర్ స్కామ్ వ్యవహారంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అడుగులు సంచలనం రేపుతున్నాయి. కేవలం పైస్థాయి ప్రకటనలకే పరిమితం కాకుండా.. అక్రమ రవాణా, కమీషన్ల వసూలు, షెల్ కంపెనీల ద్వారా నిధుల మళ్లింపు వంటి ప్రతి చిన్న లావాదేవీని బయటకు తీస్తూ ఈడీ అధికారులు అరెస్టుల పర్వాన్ని ముమ్మరం చేశారు. మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, ఆయన కుమారుడు సునీల్ కుమార్‌లతో పాటు ఐటీ మాజీ సలహాదారు రాజ్ కేసిరెడ్డిని అరెస్ట్ చేయడం, వైఎస్ఆర్‌సీపీ సీనియర్ నేత అంబటి రాంబాబుకు ఈడీ సమన్లు జారీ చేయడం ఈ కేసు తీవ్రతకు అద్దం పడుతోంది.ఏపీ బీజేపీ అధ్యక్షుడు పి.వి.ఎన్. మాధవ్ లిక్కర్ స్కామ్‌లోని అసలు సూత్రధారిని, బిగ్ హెడ్‌ను అరెస్ట్ చేయాల్సిందే అని డిమాండ్ చేస్తూ ప్రత్యక్షంగా మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేరును ప్రస్తావించడం రాజకీయంగా కలకలాన్ని రేపింది. సిట్ చార్జ్‌షీట్లతో పాటు ఈడీ నమోదు చేసిన విచారణల్లోనూ మద్యం అమ్మకాలను ప్రభుత్వ నియంత్రణలోని డిజిటల్ పేమెంట్లు లేకుండా నగదు రూపంలోనే సాగించడం, నిర్దిష్ట బ్రాండ్లకే అనుకూలంగా విధానాలు మార్చడం వెనుక నాటి ముఖ్యమంత్రి కార్యాలయం ఆదేశాలు ఉన్నాయనేది విపక్షాల ప్రధాన ఆరోపణ.ఈడీ దర్యాప్తు సరళిని పరిశీలిస్తే.. ఏజెన్సీలు ఎప్పుడూ కిందిస్థాయి నుండి పైస్థాయికి వ్యూహాన్ని అనుసరిస్తాయి. ముందుగా కేటాయింపులు పొందిన డిస్టిలరీలు, రవాణా కాంట్రాక్టర్లు, వసూలు ఏజెంట్ల వద్ద నుంచి సేకరించిన రికార్డులు, వాట్సాప్ చాట్లు, గూగుల్ టేక్-అవుట్ డేటాను విశ్లేషించి మనీ ట్రయల్ ను నిర్ధారిస్తాయి. ఇప్పటికే జగన్ ముఖ్య కార్యదర్శి ధనంజయ్ రెడ్డి, ఓఎస్డీ కృష్ణమోహన్ రెడ్డి , మిథున్ రెడ్డి వంటి అత్యంత ఆప్తుల ఇళ్లలో ఈడీ సోదాలు నిర్వహించి కీలక పత్రాలు దక్కించుకోవడం ద్వారా, ఈ కేసు దారంతా చివరికి వైఎస్ జగన్ చుట్టూనే తిరిగేలా పావులు కదుపుతున్నారు. లిక్కర్ పాలసీ మార్పుల ద్వారా వచ్చిన రూ.1,048 కోట్లకు పైగా కిక్‌బ్యాక్‌ల నిధులు హవాలా మార్గాల్లో, షెల్ కంపెనీల ద్వారా ఎక్కడికి మళ్లాయనే సాంకేతిక ఆధారాలను ఈడీ సేకరిస్తోంది. ఢిల్లీ మద్యం కుంభకోణంలో కూడా సరిగ్గా ఇదే తరహాలోనే కిందిస్థాయి అధికారుల నుంచి మొదలై చివరికి నాటి ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ దాకా దర్యాప్తు ముడిపడి అరెస్టులకు దారితీసింది. ఇప్పుడు ఏపీలో కూడా ఈడీ అదే మనీ లాండరింగ్ నిరోధక చట్టం కింద బలమైన ఆధారాలు పొందుపరిస్తే, జగన్‌కు నోటీసులు జారీ చేయడం లేదా విచారణకు పిలవడం అనివార్యంగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి.మాజీ ముఖ్యమంత్రి స్థాయి నాయకుడిని నేరుగా అరెస్ట్ చేయడమనేది కేవలం ఆరోపణల ఆధారంగా సాధ్యపడదు. ఆయనకు నేరుగా లబ్ధి చేకూరినట్లు డైరెక్ట్ మనీ ఫ్లో సాక్ష్యాధారాలు కోర్టు ముందు నిలబడేలా ఈడీ చూపించాల్సి ఉంటుంది. ఒకవేళ కేవలం అధికారుల ప్రమేయం మాత్రమే తేలితే.. పొలిటికల్ మాస్టర్‌మైండ్‌గా ఆరోపణలు చేసినప్పటికీ, ప్రత్యక్ష చట్టపరమైన చర్యల నుంచి జగన్ తప్పించుకునే వెసులుబాటు కూడా ఉంటుందని న్యాయ నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈడీ రికార్డు స్థాయి కస్టడీ విచారణలు చూస్తుంటే.. రాబోయే రోజుల్లో ఏపీ రాజకీయాల్లో ఈ లిక్కర్ స్కామ్ భూకంపం సృష్టించడం ఖాయంగా కనిపిస్తోంది. ఒకవేళ మనీ ట్రయల్ ఆధారాలు జగన్‌కు నేరుగా ముడిపడితే.. అది వైఎస్ఆర్‌సీపీ భవిష్యత్తుకే కాకుండా, రాష్ట్ర రాజకీయ సమీకరణాలకే అతిపెద్ద టర్నింగ్ పాయింట్‌గా మారే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

## ల్యాండ్ పూలింగ్ అడుగులు

**గుంటూరు, సెప్టెంబర్ 23, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ కలల రాజధాని అమరావతి నిర్మాణ పనులను మరింత వేగవంతం చేసే దిశగా అడుగులు పడుతున్నాయి. రాజధాని విస్తరణ, మౌలిక వసతుల కల్పన కోసం నిర్వహిస్తున్న రెండో విడత భూసమీకరణ ప్రక్రియకు భూములిచ్చేందుకు రాజధాని ప్రాంత రైతులు ముందుకు వస్తున్నారు. ఇందులో భాగంగా వైకుంఠపురం గ్రామ పరిధిలోని మాదల కుటుంబం తమకు చెందిన 14.365 ఎకరాల భూమిని అమరావతి నిర్మాణం కోసం సీఆర్డీఏ కు అందజేసేందుకు అంగీకరించింది. రాజధాని నిర్మణంలో భాగస్వామ్యం కావడం పట్ల ఆ రైతు కుటుంబ సభ్యులు తీవ్ర ఆనందం వ్యక్తం చేశారు.రాయపూడిలోని సీఆర్డీఏ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో మాదల శ్రీనివాసరావు కుటుంబసభ్యులు సీఆర్డీఏ అదనపు కమిషనర్ కొల్లాబత్తుల కార్తీక్‌కు అధికారిక అంగీకార పత్రాలను అందజేశారు. ఈ సమీకరణలో భాగంగా మాదల శ్రీనివాసరావు నుంచి 4.395 ఎకరాలు, మాదల అప్పారావు నుంచి 4.985 ఎకరాలు, అలాగే మాదల రాంబాబు నుంచి 4.985 ఎకరాల భూమిని ప్రభుత్వం సేకరించింది. ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఉప కలెక్టర్ బి. కన్యాకుమారి, ఇతర అధికారులు పాల్గొని రైతులకు ధన్యవాదాలు తెలిపారు.నవ్యాంధ్ర రాజధాని నగరం ప్రపంచస్థాయి ప్రమాణాలతో రూపుదిద్దుకుంటున్న తరుణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ల్యాండ్ పూలింగ్‌కు భూములిచ్చిన మాదల కుటుంబ సభ్యులు కోరారు. రెండో విడత భూసమీకరణకు అమరావతి పరిధిలోని అన్ని గ్రామాల ప్రజలు, రైతులు పూర్తిస్థాయిలో సహకరించి రాజధాని అభివృద్ధికి తోడ్పడాలని వారు విజ్ఞప్తి చేశారు.

## దసరా, దీవాళికి స్పెషల్ ట్రైన్స్...

**నెల్లూరు, సెప్టెంబర్ 23, పెన్ పవర్:** పండగలు వచ్చేస్తున్నాయ్.. వచ్చే నెలలో దసరా, దీపావళి రానున్నాయి. ఈ రెండు పండగల నేపథ్యంలో సొంతూళ్లకు వెళ్లేందుకు ప్లాన్ చేస్తున్నారా? అయితే, మీకో గుడ్ న్యూస్.. పండగ ప్రయాణికులకు భారత రైల్వే శుభవార్త చెప్పింది.పండగల సమయంలో రైళ్లపై పెరగనున్న రద్దీని దృష్టిలో ఉంచుకుని దేశవ్యాప్తంగా 100 ప్రత్యేక రైళ్లను అందుబాటులోకి తీసుకురానుంది. ఈ స్పెషల్ ట్రైన్లు నవంబర్ వరకు వివిధ మార్గాల్లో నడవనున్నాయి. ఇప్పటికే కొన్ని రైళ్లకు బుకింగ్స్ ప్రారంభమయ్యాయి.

ఆంధ్రప్రదేశ్, తెలంగాణతో పాటు తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, గుజరాత్, ఢిల్లీ, అస్సాం, ఉత్తరప్రదేశ్, బీహార్, పశ్చిమ బెంగాల్ తదితర రాష్ట్రాలను కలుపుతూ ఈ ప్రత్యేక సర్వీసులను నడపనున్నారు. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల మీదుగా వెళ్లే పలు రైళ్లు ప్రయాణికులకు ఉపయోగపడనున్నాయి.

చర్లపల్లి--నాగర్‌కోయిల్ (07535) ప్రత్యేక రైలు సెప్టెంబర్ 25 నుంచి అక్టోబర్ 23 వరకు ప్రతి శుక్రవారం నడుస్తుంది. నల్లగొండ, మిర్యాలగూడ, సత్తెనపల్లి, గుంటూరు, తెనాలి, బాపట్ల, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, చెన్నై ఎగ్మోర్, తిరుచిరాపల్లి తదితర స్టేషన్లలో ఆగుతుంది.

అలాగే, చర్లపల్లి--శ్రీకాకుళం (07037) రైలు అక్టోబర్ 6 నుంచి నవంబర్ 24 వరకు, తిరుగు ప్రయాణంలో శ్రీకాకుళం--చర్లపల్లి (07038) రైలు అక్టోబర్ 7 నుంచి నవంబర్ 25 వరకు సర్వీసులు అందించనున్నాయి. ఈ రైళ్లు నల్లగొండ, మిర్యాలగూడ, గుంటూరు, విజయవాడ, ఏలూరు, రాజమండ్రి, సామర్లకోట, దువ్వాడ, విజయనగరం తదితర స్టేషన్లలో ఆగుతాయి.మరోవైపు.. ప్రయాగ్‌రాజ్--తిరునెల్వేలి (04171) ప్రత్యేక రైలు కూడా తెలుగు రాష్ట్రాల మీదుగా నడుస్తుంది. ఈ సర్వీసు రామగుండం, వరంగల్, ఖమ్మం, విజయవాడ, తెనాలి, ఒంగోలు, నెల్లూరు, గూడూరు తదితర ప్రాంతాలను కలుపుతుంది

# న్యూజీలాండ్‌తో టెస్టు సిరీస్‌కు ముందు కీ ప్లేయర్లకు రెస్ట్.. హెడ్ కోచ్ గంభీర్ హింట్




**హైదరాబాద్ పెన్ పవర్:** న్యూజీలాండ్ తో టెస్టు సిరీస్ ను ప్రతిష్టాత్మకంగా తీసుకుంటోంది టీమిండియా. అందులో భాగంగా ఇప్పటి నుంచే సన్నాహాలు మొదలుపెట్టింది. త్వరలో టీ20, వండే, టెస్టు సిరీస్ లు ఉన్న క్రమంలో.. టెస్టు సిరీస్ కే అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు హెడ్ కోచ్ గంభీర్ చెప్పారు.

అందులో భాగంగా లిమిటెడ్ ఓవర్ల మ్యాచ్ నుంచి కీలక ప్లేయర్లకు రెస్టు ఇవ్వనున్నట్లు హింటిచ్చారు. టెస్టుకు ప్రాధాన్యతనిస్తున్నట్లు చెప్పిన గంభీర్.. ప్లేయర్లకు రెస్టు ఇచ్చే అంశం న్యూజీలాండ్ సిరీస్ కేనని క్రీడావర్గాలు భావిస్తున్నాయి.

న్యూజీలాండ్ తో 12 మ్యాచ్ ల టూర్ కు ఇండియా సిద్ధమవుతోంది. మొత్తం ఐదు వండేలలో చివరి వండే ముగిసిన మూడు రోజులకే టెస్టు సిరీస్ ప్రారంభమవుతుంది. తొలి టెస్టు వెల్లింగ్టన్ లో నవంబర్ 19 నుంచి మొదలవుతుంది. దీంతో ప్లేయర్లపై వర్క్ లోడ్ పడకుండా.. టీ20, వండేల నుంచి రెస్టు ఇచ్చేందుకు ప్లాన్ చేస్తున్నట్లు హింట్ ఇచ్చారు గంభీర్.

**ప్రపంచపటాలు పరిశీలించండి**

టెస్టు సిరీస్ కు ముందు కీలక ప్లేయర్లైన శుబ్మన్ గిల్, కేఎల్ రాహుల్, యశస్వీ జైశ్వాల్, బుమ్రా, సిరాజ్, జడేజా, నితీష్ కుమార్ రెడ్డి లు టెస్టు సిరీస్ లో కీలకంగా కానున్నారు. చివరి వండే, మొదటి టెస్టుకు కేవలం రెండు రోజుల గ్యాప్ మాత్రమే ఉండటంతో టీ20, వండేల నుంచి వీరిని దూరంగా ఉంచనున్నట్లు గంభీర్ చెప్పిన మాటల ద్వారా తెలుస్తోంది. ఇండియాలో ఎంత మంది కొత్త వాళ్లు వస్తున్నా.. టెస్టు క్రికెట్ కే అధిక ప్రాధాన్యమని చెప్పడం గంభీర్ మాటల ద్వారా తెలుస్తోంది. ఇండియన్ ప్లేయర్లు దాదాపు అన్ని ఫార్మాట్లను మేనేజ్ చేయగల కెపాసిటీ ఉండటంతో.. అవసరమైన సమయంలో ప్లేయర్లకు బాధ్యతలు ఇవ్వనున్నట్లు చెప్పారు.

ఇండియా ప్రధాన్య టెస్టు క్రికెట్. టీ20కి ఎంత క్రేజ్ ఉన్నప్పటికీ.. ఇండియా దృష్టి టెస్టులపైనే ఉంటుందన్నారు. టీ20లో బలమైన దేశం.. క్రికెట్ లో బలమైన దేశం కాలేదని.. టెస్టులో బలంగా ఉంటేనే అసలైన క్రికెట్ జట్టు అని చెప్పుకొచ్చారు.

# వాళ్లిద్దరూ ప్రపంచ కప్ గెలవాలని దేశం మొత్తం కోరుకుంటోంది: రింకూ సింగ్



**హైదరాబాద్ పెన్ పవర్:** విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ 2027 వన్డే ప్రపంచకప్‌లో భారత్ తరఫున ఆడాలని దేశం మొత్తం కోరుకుంటోందని టీమిండియా బ్యాటర్ రింకూ సింగ్ అన్నాడు. ఇద్దరూ దిగ్గజ ఆటగాళ్లని పేర్కొన్న అతడు.. 2027 ప్రపంచకప్‌లో భారత్ విజేతగా నిలిస్తే అది దేశానికే కాకుండా కోహ్లీ, రోహిత్‌కు కూడా ఎంతో ప్రత్యేకమైన సందర్భమవుతుందని చెప్పాడు.

"విరాట్ భయ్యా, రోహిత్ భయ్యా ఇద్దరూ లెజెండ్స్. వాళ్లు ప్రపంచకప్‌లో ఆడాలని నా ఒక్కడి కోరిక కాదు.. దేశం మొత్తం కోరుకుంటోంది. వాళ్లు జట్టులో ఉండి భారత్‌ను ప్రపంచకప్ విజేతగా నిలిపితే ఎంతో గొప్పగా ఉంటుంది. అది వాళ్లకు చివరి ప్రపంచకప్ కావచ్చేమో. 2011 తర్వాత భారత్ వన్డే ప్రపంచకప్ గెలవలేదు. అందుకే వాళ్లిద్దరూ జట్టుతో ఉండి ట్రోఫీ గెలిస్తే ఎంతో ప్రత్యేకం" అని జియోస్టార్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో రింకూ చెప్పాడు.

ఐపీఎల్ 2023లో గుజరాత్ టైటాన్స్‌పై వరుసగా ఐదు సిక్సర్లు బాదడంతో రింకూ ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్నాడు. అయితే తనను కేవలం ఆ ఐదు సిక్సర్లతోనే గుర్తించకూడదని అతడు అంటున్నాడు. భారత్ తరఫున ప్రపంచకప్ గెలవడంలో భాగస్వామి కావడమే ప్రస్తుతం తన ప్రధాన లక్ష్యమని చెప్పాడు. బ్యాటింగ్‌తో జట్టుకు ఉపయోగపడుతూ మరిన్ని ప్రపంచకప్ విజయాల్లో భాగం కావాలని కోరుకుంటున్నట్లు తెలిపాడు.ఇక తాను కేవలం టీ20 ఆటగాడిననే అభిప్రాయాన్ని కూడా రింకూ ఖండించాడు. దేశవాళీ క్రికెట్‌లో వన్డేలు, నాలుగు రోజుల మ్యాచుల్లోనూ ఆడుతున్నానని చెప్పాడు. భారత్ తరఫున టెస్టుల్లో అరంగేట్రం చేయాలన్నది తన కల అని వెల్లడించాడు. ప్రస్తుతం భారత్ తరఫున ఒక్క ఫార్మాట్‌లోనే ఆడుతున్నా.. మూడు ఫార్మాట్లలోనూ రాణించగలనని విశ్వాసం వ్యక్తం చేశాడు.కెప్టెన్సీపై కూడా రింకూ స్పందించాడు. యూపీ లీగ్‌లో తన జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించి టైటిల్ గెలిచానని గుర్తుచేశాడు. గత సీజన్‌లో ఐపీఎల్‌లో వైస్ కెప్టెన్‌గా ఉన్నానని చెప్పాడు. అజింక్య రహానె, సూర్యకుమార్ యాదవ్ వంటి ఆటగాళ్ల నుంచి నాయకత్వ లక్షణాలు నేర్చుకుంటున్నానని తెలిపాడు. కెప్టెన్సీలో ఇంకా ఎదగాల్సి ఉందని పేర్కొన్నాడు.

# ఆసియా క్రీడల్లో మీరాబాయి చానుకు రజతం.. 28 ఏళ్ల భారత పతక నిరీక్షణకు తెర

**హైదరాబాద్ పెన్ పవర్:** భారత స్టార్ వెయిట్?లిఫ్టర్ మీరాబాయి చాను చరిత్ర సృష్టించారు. జపాన్ వేదికగా జరుగుతోన్న ఆసియా క్రీడల్లో వెయిట్‌లిఫ్టింగ్ విభాగంలో ఆమె రజత పతకం సాధించారు. మహిళల 49 కేజీల విభాగంలో పోటీపడ్డ ఆమె స్నాచ్‌లో 87 కేజీలు, క్లీన్ అండ్ జెర్క్‌లో 111 కేజీలతో కలిపి మొత్తం 198 కేజీల బరువును ఎత్తి రెండో స్థానంలో నిలిచారు. తద్వారా ఆసియా క్రీడల్లో పతకం సాధించాలనే తన చిరకాల వాంఛను నేరవేర్చుకున్నారు. మీరాబాయి చానుకు కూడా ఆసియా క్రీడల్లో ఇదే తొలి మెడల్. ఒలింపిక్స్, ప్రపంచ ఛాంపియన్‌షిప్, కామన్వెల్త్ గేమ్స్‌లో ఇప్పటికే పతకాలు సాధించిన మీరాబాయి చానుకు ఇప్పటివరకు ఆసియా క్రీడల పతకం ఒక్కటే లోటుగా ఉండేది. తాజా రజతంతో ఆమె తన పతకాల కలెక్షన్‌ను సంపూర్ణం చేసుకున్నారు. దీంతో పాటు వెయిట్‌లిఫ్టింగ్ విభాగంలో 28 ఏళ్ల భారత పతక నిరీక్షణకు మీరాబాయి చాను తెరదించారు. 1998 బ్యాంకాక్ ఆసియా క్రీడల్లో భారత దిగ్గజ వెయిట్?లిఫ్టర్ కర్ణం మల్లేశ్వరి కాంస్య పతకం సాధించారు. ఆ తర్వాత వెయిట్ లిఫ్టింగ్ విభాగంలో ఇండియాకు పతకం రాలేదు. తాజా విజయంతో 28 ఏళ్ల భారత పతక నిరీక్షణకు చాను తెరదించారు.



# 'జనవరి 12 విడుదల ' ఇంటర్వెల్, క్లైమాక్స్ ఇదే... అనిల్ రావిపూడి ఖాతాలో 10 వ హిట్ పక్కానా...

తెలుగు సినిమా ఇండస్ట్రీలో ఇప్పటివరకు కనివిని ఎరుగని రీతిలో చాలామంది దర్శకులు సినిమాలను చేస్తూ ముందుకు సాగుతున్నారు. రాజమౌళి లాంటి దర్శకుడు వరుసగా 12 సక్సెస్ లతో ముందుకు దూసుకెళ్తుంటే అనిల్ రావిపూడి తొమ్మిది విజయాలను తన ఖాతాలో వేసుకొని పదో సక్సెస్ కోసం ప్రయత్నం చేస్తున్నాడు. ప్రస్తుతం వెంకటేష్ – కళ్యాణ్ రామ్ లను హీరోలుగా పెట్టి 'జనవరి 12 విడుదల' అనే సినిమాని చేస్తున్నాడు. ఈ సినిమా 2027 సంక్రాంతి కానుకగా జనవరి 12వ తేదీన ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఇక ఈ సినిమాతో మరోసారి అనిల్ రావిపూడి కామెడీనే నమ్ముకొని ముందుకు సాగుతున్నాడు. అయితే ఈ సినిమాలో ఎమోషన్స్ ను సైతం బ్యాలెన్స్ చేస్తూ ప్రేక్షకులను కన్నీళ్లు పెట్టించడమే లక్ష్యంగా పెట్టుకొని ముందుకు సాగుతున్నట్టుగా తెలుస్తుంది. ఇంటర్వెల్, క్లైమాక్స్ సన్నివేశాలు





ప్రేక్షకులందరిని కంటతడి పెట్టేలా డిజైన్ చేశారట. క్లైమాక్స్ అయితే భారీ ఎమోషనల్ సన్నివేశాలతో పాటు యాక్షన్ సీక్వెన్స్ కి కూడా పెద్దపీట వేసినట్టుగా తెలుస్తుంది... ఇంటర్వెల్ లో వెంకటేష్ కళ్యాణ్ రామ్ కు మధ్య ఒక పెద్ద గొడవ జరుగుతుందట. దాంతో వాళ్లిద్దరు విడిపోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఆ సందర్భంలో సినిమా చూసే ప్రతి ప్రేక్షకుడికి ఆటోమేటిగ్గా కండ్లల్లో నుంచి కన్నీళ్ళు వస్తాయనే వార్తలైతే వస్తున్నాయి. ఇక క్లైమాక్స్ సీన్ లో హీరోలిద్దరు కలిసి ఫైట్ చేసినప్పటికి ప్రేక్షకుల్లో తెలియని ఒక గూస్ బంప్స్ వచ్చే సన్నివేశాలను కూడా ఇందులో పొందుపరిచినట్టుగా తెలుస్తుంది.

ఇక ఏదేమైనా కూడా కామెడీతో పాటు ఈసారి ఎమోషనల్ గా కూడా ప్రేక్షకులను కనెక్ట్ చేయాలనే ఉద్దేశ్యంతో అనిల్ రావిపూడి చాలా స్ట్రాంగ్ డిసిజన్ తీసుకున్నట్టుగా తెలుస్తుంది. ఈ సినిమాతో తన ఖాతాలో పదో విజయాన్ని వేసుకోవాలనే ప్రయత్నంలో ఉన్నాడు. ఇక ఈ సంవత్సరం 'మన శంకర్ ప్రసాద్' సినిమాతో ప్రేక్షకులను అలరించిన ఆయన వచ్చే ఏడాది 'జనవరి 12 విడుదల' సినిమాతో మరోసారి ప్రేక్షకులను ఎంటర్ టైన్ చేయడానికి సన్నాహాలు చేస్తున్నాడు... అనిల్ రావిపూడి పేరు చెబితే చాలు ప్రేక్షకులు ఆటోమేటిగ్గా థియేటర్ కి వచ్చేస్తారు. ముఖ్యంగా అనిల్ ఫ్యామిలీ ఆడియన్స్ ను టార్గెట్ చేసిన ప్రతిసారి సక్సెస్ లను సాధిస్తుండడం విశేషం... ఇప్పటికే స్టార్ హీరోలు సైతం అతనితో సినిమాలు చేయడానికి ఇంట్రెస్ట్ చూపిస్తున్న కూడా ఆయనకున్న కమిట్ మెంట్ల ప్రకారం సినిమాలు చేసుకుంటూ ముందుకు సాగుతున్నాడు. తమిళ్ స్టార్ హీరో అయిన విజయ్ సైతం 'జన నాయకుడు' సినిమాకి దర్శకుడిగా మొదట అనిల్ రావిపూడి నే అనుకున్నారట. అనిల్ ను పిలిపించుకొని మరి మూవీ చేయమని అడిగారట. కానీ అనిల్ కి ఇతర హీరోలతో ఉన్న కమిట్మెంట్స్ వల్ల నేను ఆ సినిమా చేయలేనని చెప్పాడట. అనిల్ రావిపూడి డైరెక్షన్లో బాలయ్య హీరోగా వచ్చిన 'భగవంత్ కేసరి' మూవీ రీమేక్ గా 'జన నాయకుడు' సినిమా తెరకెక్కిన విషయం మనకు తెలిసిందే. ఇక ప్రస్తుతం విజయ్ తమిళనాడు సీఎంగా పదవి బాధ్యతలను కొనసాగిస్తున్నాడు.



Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. and published at Dno 6-5-25, medara bazar, 16 th ward, near Oid bus stand, Bapatla editor GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/25/A2233, editorpenpower@gmail.com